# ★ వాసు చదువు ★

ముద్దంశెట్టి హనుమంతరావు
(లలితశ్రీ)

## 1

సూర్యనారాయణ ఓ చిన్న పల్లెటూరిలో సామాన్యపు వ్యవసాయదారుడు. అక్కడున్న వ్యవసాయదారులందరిలో కొద్దిపాటి చదువు గలవాడితనొక్కడే. అందుకే అతనంటే చాలమందికి అభిమానం, గౌరవమూను. విద్యావిహీనులందరూ అతని దగ్గరికి వచ్చి వుత్తరాలు రాయించుకోవటం గాని, సలహాలందుకోవటం గాని కద్దు; దానికి ప్రతిఫలంగా తృణమో పణమో, ముట్టుతుండేది.

సూర్యనారాయణకి లేకలేక ఓ కొడుకు పుట్టాడు. వాసుదేవరావని నామకరణం చేశారు పెద్దలు. కాని అందరూ 'వాసు' అనే వ్యవహరిస్తుండే వారు. సూర్యనారాయణ భార్య వెంకటలక్ష్మి, ఆ బిడ్డను వరప్రసాదంగా చూసుకునేది. కుఱ్ఱాడు కూడా అందంగా, ముద్దుగా వుండేవాడు. పుట్టినప్పుడే అన్నారు నక్షత్రబలం బాగా వుందని.

సూర్యనారాయణ కొడుకుపై కొండంత ఆశ పెట్టుకున్నాడు. తన చిన్నపాటి ధనంతో వీలయినంత వరకు చదివించి ఓ వుద్యోగస్తునిగా చేయించాలని అతని అభిలాష. కాని మానవుడనుకున్నవన్నీ తప్పక జరుగుతాయన్న నిర్ధారణేమిటి? అదీ కాక సూర్యనారాయణ యేమంత చెప్పుకోతగ్గ భూఖామందు కాడు. పండించిన పంట తిండికి యితర ఖర్చులకి మాత్రం సరిపోతుంది. అయినప్పటికీ అతని నిశ్చయం బలంగానే వుంది.

రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచాయి. వాసుకి అయిదో సంవత్సరం ప్రవేశించింది. సూర్యనారాయణ కొడుక్కి అక్షరాభ్యాసం చేయించాడు. అప్పటి ఆకుర్రాడి చురుకుదనం చూచి అందరూ ఆశ్చర్యపోయి తెలివైన వాడవుతాడని అనుకొన్నారు. కన్నతండ్రి కింకేం కావాలి? ఉల్లాసంతో వుప్పొంగి పోయాడు. ఆపల్లె బడిలో వున్న విద్యార్థులందర్లోకి అందానికైతేనేం, శుభ్రతకైతేనేం, చురుకుదనానికైతేనేం, వాసుదే పైచేయి. అందుకే బడిపంతులు కూడా వాసుని యెంతో ముద్దుగా ఆప్యాయంగా చూస్తుండేవాడు.

ఒక్క క్లాసులో కూడా తప్పకుండా అయిదో క్లాసుకి వచ్చేశాడు వాసు. అప్పటి కతడికి తొమ్మిదో సంవత్సరం. ఎత్తుగా, చామన చాయగా, మంచి ఆరోగ్యంగా వుండేవాడు.

వాసు యింటి కెదురుగా వుండే ప్రకాశంకొడుకు ధర్మారావు వాసుకి ప్రాణస్నేహితుడనే చెప్పుకోవాలి. ఒక్కక్షణం వాసుని విడిచి వుండేవాడు కాదు. వీళ్ళిద్దరికీ మరెవ్వరితో స్నేహం వుండేది కాదు. ధర్మారావు నిష్కల్మష హృదయం వాసుని మరింత ఆకర్షించింది. ఇద్దరూ ఒకే యీడులో వున్నవారు కూడా. పోతే వాసు తెలివైనవాడు. ధర్మారావు అంత తెలివైనవాడు కాదు గాని అంత మొద్దు కూడా కాదు.

* * *

ఒకనాడు స్కూలు విడిచిపెట్టిన తరువాత వాసు, ధర్మారావు, పుస్తకాలు యింట్లో పడేసి యేటివేపు యిసుకతిన్నెలపైకి పోయారు. అందరిలా పిల్లు ఆడకపోయినా చల్లగాలిలో తిరగాలని, యేదో ఆవచ్చీరాని పాటలు పాడుకొంటూండాలన్న వాంఛ వుండేది వాసుకి. ఆవూహతోనే ప్రతిదినం అలా పోయేవారు. ఇవాళ కూడా వెళ్తూంటే అక్కడ పిల్లలమూక అగుపించింది. అందులో యెవర్నో పట్టుకుని తలోకసారిగా కొడ్తున్నారు. ఎవరో అరుపులు పెడుతూ యేడుస్తున్నారు. వాసు ధర్మారావు చేయిపట్టుకుని అక్కడికి పరుగెత్తాడు. మూకనిఛేదించుకుని లోపలికి పోయారు. కనీసం దగ్గరికి రావటానికి

# ★ వాసు చదువు ★

శంకించే వాసు రావటంతో యిక్కడి వాళ్ళక్కడ విడిపోయారు. పాపం! ఓ పదేళ్ళ కుర్రాణ్ణి పట్టు కొట్టుతున్నారు. ఆ కొత్తబ్బాయి వీళ్ళని చూడ్డంతో కాస్త ధైర్యం తెచ్చుకున్నాడు.

"ఎందుకొట్టుతున్నార్రా?" గద్దించాడు వాసు. అప్పుడు ధర్మారావు వీగుడిలా నడుంమీద చేతులు వేసుకుని నిల్చున్నాడు. అంతా కాస్సేపు నిశ్శబ్దంగా వూరుకున్నారు. ఆ మూకనుండి ఒకడు కాస్త ముందుకొచ్చి

"మేం అందరం గిల్లీదండి ఆడుకుంటున్నాం వాసూ! అతడూ వచ్చి ఆడతానన్నాడు. ఆడించాం గాని ఆడలేకపోయాడు. ఉడుకుమోత్తనంగా మమ్మల్నందర్నీ తిడుతున్నాడు" అన్నాడు. వాసుకి పరిస్థితి అర్థమయ్యింది.

"పోనీలెండోయ్...ఒక్కడని అందరూ కలిసి కొడితే బావుంటుందా? తిట్టాడే అనుకోండి... మీరూ తిట్టియ్యండి. లేకపోతే పెద్దవాళ్లదగ్గరికి తీసుకువెళ్లండి" అన్నాడు వాసు బోధపర్చే ధోరణిలో. వాసు తగవులమనిషి కాడని వాళ్లకి తెలుసు. అందుకే అతని మాటకి జవాబు చెప్పకండా యెవరిమట్టుకు వాళ్లు వెళ్లిపోయారు క్రొత్తబ్బాయిని విడిచి.

"ఏం పేరబ్బాయ్ నీది?" అన్నాడు వాసు.

"రామదాసు" అన్నాడా అబ్బాయి మొహాన్ని చొక్కాతో తుడుచుకుంటూ.

"ఏవూరు? యిక్కడికెలా వచ్చావూ?" రెండు ప్రశ్నలు ఒకే సారి కురిపించాడు ధర్మారావు

"మాది పడమటిదేశం - యీ వూరు రెండురోజుల క్రితం వచ్చాం. మా మేనమామ పండరిభజన నేర్పుతారు. అతనితో వచ్చాను" అన్నాడు రామదాసు.

"ఊ...సరే, మాతో అలా తిరగటానికి వస్తావా?" అన్నాడు వాసు.

"రాకేం? నాకూ స్నేహితులెవ్వరూ లేక చస్తున్నాను" అన్నాడా అబ్బాయి మొహంలో యేవో భావాలు వ్యక్తపరుస్తూ. వాసుకి అతడి మాటల్లో అదో మాదిరి క్రొత్తదనం కన్పించింది

"ఈ వూరు సంగతి నీకింకా తెలీదు దాసూ! అయితే నువ్వు పాడగలవా?" నడుస్తూ అన్నాడు. ధర్మారావు వాసు ప్రక్కనే మౌనంగా నడుస్తున్నాడు.

"పండరిభజనపాటలన్నీ పాడతా" అన్నాడు రామదాసు. వాసు మెదడులో మెఱుపు మెరిసింది. పాటలు నేర్చుకోవాలన్న అభిలాష అతడికీ వుంది కదూ మరి.

"ఏదీ ఒకపాట పాడు" అన్నాడు వాసు కూర్చుంటూ. ఆ చల్లని వాతావరణంలో యిసుకతిన్నెల మీద కూర్చున్నారు ముగ్గురూ. రామదాసు ఓపాట పాడాడు. వయసులో చిన్నవాడైనా వాసు తన్మయుడైపోయాడు. తనకీ యిలా పాడ్డం వస్తే యెంత బావుణ్ణు? అనుకున్నాడు మనసులో

"నాకీ పాటలన్నీ నేర్పుతావా?" అమాయకంగా అడిగాడు వాసు.

"నాకూ్కడా" అన్నాడు ప్రక్కనుండి ధర్మారావు.

"అలాగే" అన్నాడు రామదాసు కాస్త గర్వంగా.

అప్పట్నుంచీ ముగ్గురూ ఒకరినొకరు విడగీయని స్నేహితులయ్యారు. కొద్దిరోజులు గడచినయ్. వాసు తన శ్రావ్యమైన గాత్రంతో కొన్ని పాటలు నేర్చాడు. ధర్మారావు నేర్వాలని ప్రయత్నం చేసి విఫలుడయ్యాడు.

అయితేనేం రామదాసు స్నేహం వీళ్ళతో అట్టే కాలం నిలవలేదు. ఓరోజు రామదాసు సిగరెట్టు త్రాగుతుండటం చూశాడు వాసు. ఇంత చిన్నతనంలో సిగరెట్ త్రాగటమా! అని ఆశ్చర్యపోయాడు.

"దాసూ! సిగరెట్లు యింత చిన్నప్పట్నుంచే త్రాగటం తప్పు కదూ! అసలు త్రాగనేకూడదు. మానెయ్యాలి మరి..." అన్నాడు వాసు. ఈ మాటలకి దాసుమనసు దెబ్బతింది

"ఇది లేకపోతే వుండలేను వాసూ" అన్నాడు విరక్తిగా దాసు.

"వుండాలి మరి. సిగరెట్లు త్రాగితే గుండెలార్చుకుపోతాయి" అన్నాడు వాసు తను పుస్తకాల్లో చదివినవి నెమరువేసుకొంటూ. దాసుకి బోనులో చిక్కుకున్నట్టనిపించింది.

"అలాగే వాసూ" అని మాత్రం అన్నాడు విధిలేక, వాదించలేక.

ఆ రోజునుండి రామదాసు వాసుకి దూరదూరంగా తిరుగు

తుండేవాడు. మళ్ళీ మామూలుగా మిగిలారు యిద్దరు స్నేహితులే - వాసు, ధర్మారావు.

## 2

ఇన్స్పెక్టరు వచ్చి క్లాసు తనిఖీ చేస్తాడనీ, అప్పుడే పరీక్ష చేసి అందులో ఉత్తీర్ణులైనవారినే 'పై' క్లాసుకి పంపుతారని బడిపంతులు చెప్పాడు. ఈ వార్త వాసుకెంతో ఆనందాన్ని కలిగించింది. ఒక్క నిమిషంకూడా వృథాగా పోనివ్వకుండా చదువుకునేవాడు. ధర్మారావు అప్పుడప్పుడు వచ్చి చదువుకుని పోతూండటం కద్దు. వాసు తనకి తెలియని విషయాలు బడిపంతుల్ని అడిగి తెలుసుకుంటుండేవాడు. అలా అడిగి తెలుసుకుంటున్నందుకు బడిపంతులు వాసు నెంతో మెచ్చుకునేవాడు.

ఇన్స్పెక్టరు వచ్చే రోజది... వాసు చక్కగా శుభ్రంగా ముస్తాబై ధర్మారావుతో కలిసి బడికి పోయాడు. ఇన్స్పెక్టరు ఒక్కో క్లాసువాళ్లనీ పరీక్ష చేస్తూ చివరికి అయిదో తరగతికి వచ్చాడు. పంతులు తన కుర్చీ అతని కిచ్చి ప్రక్కనే నిల్చున్నాడు. ఇన్స్పెక్టరు ఒక్కసారి క్లాసునంతా కలయజూశాడు. అతని కళ్లకి యిద్దరే పరిశుభ్రంగా కన్పించారు. వాసు-ధర్మారావు.

ఇన్స్పెక్టరు అన్ని విషయాల్లో ప్రశ్నలు వేస్తూనేవున్నాడు. ధర్మారావుకూడా అప్పుడప్పుడు తప్పిపోతుండేవాడు. దేన్నీ తప్పకుండా చెపుతున్నవాడొక్క వాసే. ఇన్స్పెక్టరు గట్టి ప్రశ్న వేశాడు. పిల్లలందరూ తెల్లమొహాలు వేశారు. ఇన్స్పెక్టరు అనుకున్నాడు, అది శాస్త్ర చిక్కుప్రశ్న అని, ఎవరూ చెప్పలేరని. అందుకే "ఎవరైనా చెప్పగలరా?" అన్నాడు.

"నేను చెప్తాను సార్.." అంటూ నిల్చుని తకీమని జవాబు చెప్పాడు, వాసు.

బడిపంతులి ముఖం కళకళలాడింది. ఇన్స్పెక్టరున్నాడన్న ధ్యాస లేకపోతే గంతులేసేవాడు కూడా. ఇన్స్పెక్టరుకూడా నవ్వుతూ కుర్చీలోనుండి లేచి వాసుదగ్గరికి పోయి అతనిభుజంమీద తట్టుతూ—

"చాల చురుకైన కుర్రాడు... ఎవరబ్బాయుండీ, మాష్టరుగారూ?" అన్నాడు.

"సూర్యనారాయణని ఓ వ్యవసాయదారుని కొడుకు సార్...తండ్రికూడా వీడిలానే తెలివైనవాడు!" అన్నాడు నవ్వుతూ పంతులు.

"వారసత్వం వుంటుందంటారందుకే...యిలాంటి అబ్బాయిని పై చదువులకి పంపితే బావుంటుంది" అంటూ వాసు బుగ్గమీద వ్రేలితో మెల్లగా మీటి పోయి కుర్చీలో కూర్చున్నాడు. క్లాసుకుర్రాళ్లంతా వాసు పొందిన మెప్పుకి అసూయపడినా, ధర్మారావు మాత్రం ఆనందించాడు.

ఇన్స్పెక్టరు వెళ్లిపోయిన తరువాత బడిపంతులు వాసుని దగ్గరగా పిల్చాడు వాసు తనదేం తప్పుందోనని బిక్కమొహం వేసుకు వెళ్లాడు.

"నిజంగా నా పరువు దక్కించావురా వాసూ! నీ వల్ల నాకూ పేరొచ్చింది. రిమార్కు లేకుండా గ్రాంటు పెరుక్కున చేశాడు. నీలాంటివాళ్లుంటే శ్రద్ధగా చదువు చెప్పాలని బుద్ధిపుడుతుంది. అందరికంటె ఫస్టుగా సూర్యనారాయణకి" అన్నాడు పంతులు. వాసు ఆనందంతో గంతులేస్తూ—

"మరి, ధర్మారావుకి?" ఆత్రంగా అడిగాడు. ధర్మారావు అదోలా ముఖంపెట్టి చూస్తున్నాడు పంతులేం చెప్తాడో అని. "వాడూ పాసయ్యాడు" అని పంతులనడం తడవుగా ఒక్కగంతులో ధర్మారావు దగ్గరికి పోయాడు వాసు. ధర్మారావు ముఖం విప్పారింది. ఆ అమాయకపు మిత్రుల సంతోషం చూసి నవ్వుకున్నాడు బడిపంతులు. తరువాత పాసైనవాళ్లందరిపేర్లు చెప్పేశాడు. తప్పిన తక్కినవాళ్ళంతా బిక్కమొహాలు వేసుకున్నారు. విచిత్రమేమిటంటే తప్పినవాళ్లంతా పుష్కలంగా డబ్బున్నవాళ్లే.

"తప్పితే వాళ్ళకేం లే...మరో సంవత్సరం చదువుతారు" అన్నాడు వాసు నవ్వుతూ. ఉత్తీర్ణులైన వాళ్ళంతా ఫక్కున నవ్వారు. చివరికి పంతులుకూడా నవ్వాడు. కాస్సేపు పోయాక అంతా యిళ్లు చేరుకున్నారు.

వాసు యిల్లుచేరుకున్న తరవాత జరిగిందంతా తండ్రితో చెప్పాడు. సూర్యనారాయణ అమితంగా సంతోషిస్తూ, ఆనందబాష్పాలు తుడుచుకున్నాడు.

"ఎందుకేడుస్తున్నావు నాన్నా?" అమాయకంగా అడిగాడు వాసు. అతడికేం తెలుసు అవి ఆనంద బాష్పాలని? సూర్యనారాయణకి నవ్వొచ్చింది. -

# ★ వాసు చదువు ★

"ఏడుపు కాదురా - ఆనందాతిశయంతో యిలా కన్నీళ్లు కారతాయి" అన్నాడు నవ్వుతూ.

"ఓస్! అంతేనా?" అంటూ వీధిలోకి వురికాడు వాసు.

ఇప్పుడు సూర్యనారాయణకి పెద్ద సమస్య యేర్పడింది. 'కొడుకు చదువు ఆ పల్లెలో అయిపోయింది. పై చదువు చదివించటం యెలా? ఎక్కడ చదివించటం?' అని. బడిపంతులూ యింకా కొందరు యెన్నో సలహాలిచ్చారు. కాని సూర్యనారాయణ యే ఒక్క నిశ్చయానికీ రాలేకపోతున్నాడు.

## 3

వరహాలు సూర్యనారాయణ చెల్లెలు. ఆమె పట్నంలో వుంది. ఆమె మొన్నోనాడు అన్నగారింటికొచ్చింది. చెల్లెల్ని చూడ్డంతోనే సూర్యనారాయణకి యేదో ఆలోచన మెదిలింది.

"ఏదో యిన్నాళ్ళకి మాయింటికొచ్చావు చెల్లాయ్" అన్నాడు సూర్యనారాయణ.

"ఎప్పుడు వచ్చేదన్నయ్యా! మొన్ననే కదా, కలకత్తానుండి వచ్చాను..." అంది. వాసు ఆమె ప్రక్కనే నిల్చుని అదోలా చూస్తున్నాడు. వరహాలు వాణ్ణి పరకాయించి చూస్తూ—

"ఎంత వాడివయ్యావురా! యేం చదువుతున్నావ్?" అంది. వాసు నవ్వుతూ యేదో చెప్పాలనుకుంటుండగా సూర్యనారాయణ అందుకున్నాడు.

"మొన్ననే అయిదో తరగతి పాసయ్యాడే - అదీ యెలాగనుకున్నావ్? మంచి మార్కులతో; యినస్పెక్టరు వీణ్ణి యెంతగానో మెచ్చుకున్నాడట."

"ఆ! అలాగా... ముఖమే చెప్తోందిలే, తెలివైనవాడని" అంది వరహాలు.

"మనమలిక్కడే వున్నారా?"

"లేకపోతే మరెక్కడికి పోతారు?"

"ఏం చదువుతున్నారేమిటి?" ఆసక్తితో అడిగాడు సూర్యనారాయణ.

"పెద్దవాడు కామేశం ఆరో తరగతి, చిన్నవాడు విశ్వం నాలుగో తరగతీను."

"బుద్ధిగా చదువుకుంటున్నారు కదూ?"

"ఆ! యేం చదువు— యెండాకాలం చదువంటూరందుకే. ఎప్పుడు చూచినా ఆటలతో సరిపోతుంది మరి అన్నయ్యా! వాసుని యెక్కడ చదివించాలనుకుంటున్నావ్?" అంది వరహాలు ఆ ప్రసక్తి తనకి తానుగా చెల్లెలు తెచ్చినందుకు ఆనందించాడు సూర్యనారాయణ.


"అదే ఆలోచిస్తున్నాను వరహాలూ! నీకు తెలీందేముంది? ఏ విశాఖపట్నంలోనో, విజయనగరంలోనో, అయితే నాకు చదివించటానికి శక్తిలేదని నీకు మాత్రం తెలీదూ? వాడికి చదువుకోవాలన్న కోరిక వుంది. వాడు చదివి, బాగుపడ్డం చూడాలని నాకూవుంది. కాని అది మన చేతుల్లో వుందా? అంతా భగవదిచ్ఛ. సమయానికి నువ్వొచ్చావు..." అన్నాడు. సూర్యనారాయణ.

వరహాలుకి అన్నమాట లేం అర్థంకాలేదు. ఎంతో తెలిసినట్టు ఒక్కనవ్వు నవ్వి వూరుకుంది. అయితేనేం సూర్యనారాయణ తన మనసులో దాగున్న అభిప్రాయాన్ని వెలిబుచ్చలేదు అప్పుడే.

మూడురోజులుండి నాలుగోరోజు సాయంకాలం వెళ్ళిపోవాలనుకుంది వరహాలు. నాలుగోరోజు వుదయం సూర్యనారాయణ కొడుకు చదువు ప్రస్తావన యెత్తాడు.

"చెల్లాయ్, కుర్రాడి అభిలాష, వుత్సాహం చూస్తే వాడి చదువు విషయంలో నిస్సహాయుణ్ణి అయినం

ప్రఖ్యాత ఫ్రెంచి నవలాకారుడు
విక్టర్ హ్యూగో రచించిన
★ ఘంటారావం ★
నవలకు పుస్తకరూపంలో తెనుగు అనువాదం
అనువాదకులు: సూరంపూడి సీతారామ్
వెల రు. 1-8-0 పోస్టుఖర్చులు ప్రత్యేకము
ఆంధ్ర గ్రంథమాల, మద్రాసు-1




—వి. మురళి (8), సికింద్రాబాద్.

దుకు నాకే సిగ్గేస్తుంది. వాడి చదువు భారమంతా నీ చేతుల్లో పెట్టాలని యెన్నాళ్లనుంచో అనుకుంటున్నాను" అన్నాడు సూర్యనారాయణ.

ఇప్పుడంతా అవగాహన చేసుకోగలిగింది వరహాలు. అప్పుడే తన సమ్మతిగానీ, అభిప్రాయాన్నిగానీ, తెలియబర్చలేకపోయింది. కొడుకుల యింట్లో తనకు లేని స్వతంత్రం జ్ఞాపకానికి వచ్చింది. కాని, చూస్తే అన్నయ్యకొడుకు... ఆమెలో అదోలాంటి బాంధవ్యం మొలకెత్తింది.

"నాయింట్లో నాకు స్వతంత్రం లేదని నీకు తెలిసిందే కదన్నయ్యా! అబ్బాయిల్నడిగి చెప్తాను. నాకు మాత్రం వానంటే అభిమానం లేదూ? వీడివుత్సాహం చూస్తుంటే నాకూ అలానే అన్పిస్తోంది. నేను వెళ్ళి యీసంగతి తెలియబరుస్తాను. అసలు మాయింట్లో మగాళ్లు పూ॰ కొట్టినా కోడళ్లుమాత్రం ఒప్పుకుంటారో లేదో?"

"ఆమాత్రం నువ్వు చెప్పలేవూటే — వీడుకూడా నీ మనుమల్లో ఒకడనుకోకూడదూ! ఆ కుర్రాళ్ళతో పాటు వీడూ వుంటాడు" అన్నాడు సూర్యనారాయణ నవ్వుతూ. వాసు వీళ్ల సంభాషణ ఆసక్తిగా వింటున్నాడు.

"చూస్తాలే అన్నయ్యా" అంది వరహాలు.



'పిల్లడి చెలగాటం పిల్లికి ప్రాణసంకటం'
—ఫొటో : ఎన్. రామకృష్ణ, మాయవరం.

# వాసు చదువు

"చూస్తానంటే కాదు చెల్లీ... నువ్వు గట్టిపట్టు పట్టాలి. నేనూ నా చేత నయిన మట్టుకు సహాయం చేస్తుంటాను" అన్నాడు సూర్య నారాయణ. వాసు వుత్సాహంగా తండ్రి భుజాన్ని నొక్కాడు.

"అలాగేలే అన్నయ్యా" అంది వరహాలు. వాసు వుత్సాహంతో వుక్కిరి బిక్కిరయ్యాడు. అప్పుడే పట్నంలో చదువుతున్నట్టుగా భావించుకున్నాడు.

ఆరోజు సాయంకాలం నాలుగ్గంటలకి వరహాలు బయలుదేరి పట్నం వెళ్లిపోయింది. యథాప్రకారం అయిదు గంటలకి వాసు, ధర్మారావు మళ్లీ యిసుక తిన్నలమీదికి పోయారు.

"ధర్మా! నేను పట్నం పోతున్నారా" అన్నాడు వాసు. అసలు ఆ విషయం యెంత వేగిరం ధర్మారావు చెవిలో పడేద్దామా అన్న ఆత్రుతతో వున్నాడు వాసు.

"ఆ! అదెప్పుడు?" ఆశ్చర్యంగా అడిగాడు ధర్మారావు.

"మా అత్తయ్య వచ్చింది కదూ! మానాన్న వాళ్లింటికి నన్ను చదువుకోసం పంపుతారట" అన్నాడు వాసు.

"మీ అత్తయ్య యేమంది?" చప్పున ప్రశ్న వేశాడు ధర్మారావు.

"అలాగే నంది"

"మరింకేం - నువ్వు పట్నం వెళ్లిపోతావన్న మాట" అన్నాడు ధర్మారావు. ఆ అమాయకపు హృదయంలో అర్థంకాని ఆవేశం, ఆరాటం తొంగిచూస్తున్నయ్

"నువ్వు కూడా వచ్చేయకూడదూ?" అన్నాడు అమాయకంగా వాసు.

"ఏమో చెప్పలేనురా ..."

"మీకేం — డబ్బు లేదుగనకనా! పట్టు పడుదూ, మీనాన్న పంపిస్తాడు."

"నిజమే అనుకో! చూద్దాంలే"

"మళ్లీ యెప్పుడు యీ యిసుక తిన్నలమీద కల్సుకుంటామో?" పట్నం తప్పకుండా పోతానన్న ధైర్యంతో అన్నాడు వాసు.

"అప్పుడప్పుడొస్తూంటావు కదూ?" అన్నాడు ధర్మారావు. తను పట్నం పోవటం సందిగ్ధంలో వుందని అతని నమ్మకం. వాసు స్నేహితుని అభిప్రాయం తెలుసుకున్నప్పటికీ ఒత్తిడిచేసి మరేం అడగలేదు.

అప్పుడే సూర్యుడు కొండ చాటుకి పోతున్నాడు. నీటిలో సూర్యాస్తమయ ఛాయలు దూరంలో స్పష్టంగా కన్పిస్తున్నయ్. చీకటి రాత్రులవటం వల్ల ఒక్కసారిగా చీకటి అలముకుంది. మిత్రద్వయం యింటిముఖం పట్టారు.

(సశేషం)

★

పెద్దకథ:

# వాసు చదువు

ముద్దుశెట్టి హనుమంతరావు

(గతసంచిక తరువాయి)

## 4

వరహాలు పట్టుబట్టి ప్రయత్నించటం వల్ల వాసు చదువు పట్నంలో నిర్ణయించ బడింది. తన మాట నిలబెట్టి నందుకు వరహాలు కొడుకుల్ని ఎంతగానో అభినందించింది. వరహాలు అక్కయ్య రత్నమ్మ యీ నిర్ణయానికి ఉప్పొంగి పోయింది. రత్నమ్మ సంగతి యిక్కడ కాస్త చెప్పాలి... ఆమె భర్త చనిపోయిన దగ్గర్నుండి చెల్లెలు దగ్గరే వుంటోంది. కాస్త స్థిరాస్తి వుంది. వాసుపై ఆమెకున్న అభిమాన, ఆదరాలు, మరెవ్వరికీ లేవు. సంతానం లేనందువల్ల వాసుని ఓ కొడుకుగా భావించుకుని ముచ్చట తీర్చుకుంటుంది. అది కొందరి అసూయకి కారణ భూతమైనా, తన అభిప్రాయం మార్చుకోలేదు. అల్లాంటి వాసు పట్నం, తనున్న దగ్గరికే చదువుకు వస్తున్నాడంటే సంతోషం కాదూ మరి?



దీపావళి రాత్రివేళ
[illegible] ఒక [illegible]!

—ఫోటో: బి. ఎస్. భూషణ్.

> "అబ్బాయి! మీ అమ్మ మీ నాన్నను కొట్టినప్పుడు, మీనాన్న నిషాలో ఉన్నాడా?"
> "లేదండి! విడిచిన గుడ్డలు వేసే పెట్టెలో ఉన్నాడు"

వరహాలు అన్నగారి పల్లెకివచ్చి వాళ్లతో జరిగిందంతా చెప్పింది. సూర్యనారాయణ దంపతులు అమితానందం పొందారు. వాసు సంతోషానికి పట్టపగ్గాలు లేకపోయాయ్. ఆ రోజు సాయంకాలం వాసు, ధర్మారావు యిసుక తిన్నెలపైకి పోయారు.

"మా అత్తయ్య యీ వాళ వచ్చిందిరా" అని మొదలు పెట్టాడు వాసు.

"ఎందుకూ? ఆత్రుతగా అడిగాడు ధర్మారావు.

"ఎందుకేమిటి?" నన్ను తీసుక పోయేందుకు.. నాచదువు పట్నంలో నిశ్చయమై పోయింది"

"అవుతే యెప్పుడు ప్రయాణం?"

"రేపే"

"రేపే!" నిరుత్సాహంగా అన్నాడు ధర్మారావు. అతని కళ్లల్లో నీళ్లు తిరుగుతుండటం చూశాడు వాసు.

"ఎందుకురా అలా కళ్లతడి పెట్టుకొంటావ్? అప్పుడప్పుడొస్తుంటాలే" చెమ్మగిలిన కళ్లని కమీజుతో తుడుకుంటూ అన్నాడు వాసు. ఆ దృశ్యం చూచిన వారి గుండెలు కరిగిపోతా యనటంలో ఆశ్చర్యం లేదు. అదృష్ట వశాత్తూ యెవ్వరూ చూళ్లేదు.

తరువాత కాస్సేపు యెవ్వరూ మాట్లాడక మౌనంగా కూర్చున్నారు. వాసు కిదంతా బాధకరమన్పించింది. పట్నం పోతున్నాడన్న యింత ఆనందం ఒక్కసారి నన్నగిల్లి పోయింది. ధర్మారావుని విడిచి యెలా పోవటమా అన్నది ఓపెద్ద సమస్య అయింది. కాని, స్నేహితుని విడువలేకపోతే మరి భావిజీవితమో! యెప్పుడూ యీ యిసుకదిబ్బలమీదే తిరుగుతావా? అంది అంతరాత్మ. మరి ధర్మారావు యెదుట కూర్చోలేక పోయాడు.

"ఇంటికి పోదాం లే ధర్మా" అంటూ లేచి ముందుకి నడిచాడు. ధర్మారావు యేదో ఆలోచించుకుంటూ వాసుని వెంబడించాడు.

మరుచటి రోజే వాసు మేనత్తతో పట్టణం ప్రయాణం కట్టాడు. కన్నబిడ్డ దూరమై పోతున్నందుకు వెంకటలక్ష్మి కళ్ల నీళ్లు పెట్టుకుంది. కాని శుభసమయంలో కంటతడి పెట్టడం మంచిది కాదని నిగ్రహంతో చిరునవ్వు మెరిపించింది. సూర్యనారాయణ, ధర్మారావు, స్టేషనుకి వెళ్లారు. రైలు బండిలో కూర్చున్నారు. బండి విడిచి పెడుతున్నప్పుడు

"వరహాలూ! వీడి భారమంతా నీదేనమ్మా! మేం దూరమైపోతున్నాం" అన్నాడు సూర్యనారాయణ బొంగురు గొంతుతో. ఎంత ఆపుకోవాలన్నా కన్నీరు ఆగింది కాదు. పైమీది కండువాతో తుడుచు కున్నాడు.

(సశేషం) ★

సంపూర్ణ శరత్ సాహిత్యం
★40 పుస్తకాలలోనూ..
14 సంపుటములుగానూ...
వెలువడినాయి/ వివరాలకు ...
దేశికవితామండలి, విజయవాడ2

ఎప్పుడూ క్షణమైనా చింతలేదు




అతడు లాక్టోజన్ పోషణ కావడమే కారణం. తల్లిపాలవలె పుష్టికరమైనదేకాక తేలికగా లాక్టోజన్ అరుగుతుంది.

విశ్వసించండి
LACTOGEN
తల్లిపాలు ఇవ్వలేనపుడు

ఉచిత లాక్టోజన్ ఫోల్డర్‌కు ఈ కూపన్ పూర్తిచేసి పంపండి.
నెస్లేల్స్ (ప్రొడక్ట్స్) (ఇండియా) లి.
పోస్టు బాక్సు 396, కలకత్తా

పేరు ____________
చిరునామా ____________
____________

L6/6/8

పెద్దకథ:

# వాసు చదువు

ముద్దంశెట్టి హనుమంతరావు

(గతసంచిక తరువాయి)

## 5

పట్నం చేరుకున్న వాసుకి, ఆరోడ్లు, యిల్లు, కార్లు, చివరకి మనుషులు సహితం వింతగా కన్పించారు. ఇక తనుండవల్సిన యిల్లు, అంటే వరహాలు యిల్లు దేవేంద్ర భవనంలా తోచిందతనికి. కాని పగలంతా చీకటికొట్టులా వుండేది. సాయంకాల మవటంతో యేదో కొత్త లోకంలో వున్నట్టనిపించింది.

వరహాలు మనుమలు కామేశం, విశ్వం, వాసుని చూచి నవ్వుకున్నారు. ఎందుకు నవ్వారు? అంతా పల్లెముస్తాబు వాసుది. జుత్తు దువ్వడూ చిందర వందరగా యెగురుతూనే వుంటుంది. బట్టలు శుభ్రంగావున్నా అన్నీ పాతవే. ఇవే వాళ్ళ నవ్వుకి కారణాలయ్యాయి. కాని వాసు మనోనిగ్రహం కలవాడవటం వల్ల తనూ నవ్వేసి వూరుకున్నాడు. కామేశం తల్లి సీతాలక్ష్మి వాసునిచూచి మూతి విరుచుకుంది. వాసు తనింట్లో అడుగుపెట్టడం ఆమెకి సుతరామూ యిష్టంలేదు.

క్రిష్ణారావు వరహాలు సవతి కొడుకు. వరహాలు వుంటున్న యింటివెనుక భాగంలోనే అతనూ వుంటున్నాడు. అతడు హైస్కూల్లో ఉపాధ్యాయుడు పల్లె నుండి రావటంతోనే మేనల్లుణ్ణి క్రిష్ణారావు దగ్గరికి తీసుకుపోయింది. వాసు మొదట్లో క్రిష్ణారావు గారి గంభీరాకారం చూచి భయపడిపోయాడు.

"ఈ అబ్బాయేనా, మీఅన్న కొడుకు పిన్నీ" అన్నాడు క్రిష్ణారావు ఆమాటల్లో యెంతో సౌమ్యత అగుపించింది వాసుకి.

"ఔను రా" అందివరహాలు

వాసుకి యెదురుగావున్న జామి చెట్టుపైదృష్టి పడింది. ఎక్కడేనా కాయలున్నా యేమోనని దీక్షగా చూస్తున్నాడు. క్రిష్ణారావు మాష్టరు అదిగమనించి

"వెళ్ళితీసుకోవోయ్ - పండిన కాయలేవున్నయ్" అన్నాడు. 'ఆకారంచూసి భయపడ్డానుగాని, చాలా మంచి వాడిలా ,వున్నాడే' అనుకున్నాడు మనస్సులో వాసు. అనటమే తడవుగా చెట్టుదగ్గరికి పోయాడు వాసు.

"కుర్రాడు చురుకైన వాడిలా కనిపిస్తున్నాడు పిన్నీ" అన్నాడు క్రిష్ణారావు.

"తెలివైన వాడు కూడాను... అయిదోక్లాసులో యినస్పెక్టరు వీణ్ణి యెంతో మెచ్చుకున్నాట్ట" అంది వరహాలు నవ్వుతూ.

"అయిందో చెప్పు - మొహం చూస్తేనే తెలుస్తుంది ... నేనిప్పుడడిగి తెలుసుకుంటానుండు." అన్నాడు క్రిష్ణారావు. అప్పటికింకా కాయలున్న కొమ్మని అందుకోబోతున్నాడు వాసు వరహాలు పిల్చింది. వాసుతిరిగి వస్తుంటే

"కాయ తీసుకొన్న తరువాతే రావోయ్" అన్నాడు క్రిష్ణారావు.

"ఫరవాలేదండి" అంటూ చేతులు ఫేంటుకి తుడుచుకుని వచ్చాడు వాసు.

క్రిష్ణారావు అతని బుద్ధికి మెచ్చుకున్నాడు మనస్సులో

"అబ్బాయ్, అయిదోక్లాసుపాసయ్యావు కదూ?""

"ఔనండి..." చేతులు కట్టుకుని చెప్పాడు వాసు

"నీకింకా యెక్కువ చదువుకోవాలని వుందా?"

"ఔనండి..."—అందుకే మా నాన్న పంపారు" అమాయకంగా అన్నాడువాసు.

"అవుతే, యేదీ చెప్పు ... మొగలు సామ్రాజ్యాన్ని యెవరు స్థాపించారు?"

"బాబరండి" తడుముకోకండా చటుక్కున చెప్పాడు వాసు.

అదొక్కటే కాకండా యింకా అనేక విషయాలు అడిగాడు క్రిష్ణారావు. అన్నింటికి సరైన జవాబులు చెప్పాడువాసు. క్రిష్ణారావు వాసుని

వెళ్ళి పొమ్మన్నాడు. వాసు జామికాయ సంగతే మర్చిపోయి యింటికి పోయాడు.

"మీ మనుమల కంటె తెలివైనవాడు పిన్నీ... ఫస్టుఫారంలో వేయించినాఫరవాలేదు...యిల్లాంటి వాళ్లు చదువుకోవటం మంచిది" అని తన అభిప్రాయం వెల్లడించాడు క్రిష్ణారావు.

"నువ్వే తీసుకపోయి జాయిన్ చేయించరా..." అంది నవ్వుతూ వరహాలు.

"అలాగేపిన్నీ" అన్నాడు క్రిష్ణారావు, తరువాత వరహాలు అక్కడి నుండి వెళ్లిపోయింది. క్రిష్ణారావు భార్య భర్తకిదగ్గరసా వస్తూ "కుర్రాడు చాలబుద్ధి మంతుడిలా వున్నాడండీ" అంది.

"ఔను... పిల్లలకి తర్ఫీదివ్వటంలో వుంది వాళ్ళ భవిష్యత్తు" అన్నాడు క్రిష్ణారావు.


వరహాలు యింట్లోకి పోయి చూచింది గదా, వాసు ఒంటరిగా కూర్చుని యేదో ఆలోచిస్తూ పేనత్తరావటమే గమనించలేదు. వరహాలు లోలోపల నవ్వుకుంది.

"ఏంరా ఇక్కడ ఒంటరిగా కూర్చున్నావ్? కామేశం, విశ్వం, ఆ గదిలో కూర్చున్నారు కదూ వెళ్లు...... వరాయి వాళ్ళలాసిగ్గందుకూ?" అంది.

అలాగేనని తల మాత్రం వూపాడు వాసు. కాని వాళ్ళ దగ్గరకి వెళ్లేందుకు సంకోచిస్తున్నాడు. ఎందుకూ అంటే వాళ్లిద్దరన్నదమ్ములు తనను హేళనచేస్తారేమోనన్న భయం వుందతనికి. అలాగని యెంతకాలం వాళ్లకిదూర దూరంగా తిరుగుతాడు? ధైర్యం చేసి వెళ్లాడు. వాళ్లిద్దరూ చీట్లపేక ఆడుకుంటున్నారు.

"ఆడతా వేమిటోయ్ వాసూ?" అన్నాడు విశ్వం. అలా అన్నప్పుడు నవ్వ లేదుకూడా. ఆమాత్రం మర్యాదిచ్చి మాట్లాడినందుకు విశ్వంని మెచ్చుకున్నాడు మనసులో.

"నాకీ ఆటరాదు విశ్వం...మీరాడండి - నేను చూస్తా" అన్నాడు వాసు. అతని కాశ్చర్యం వేసింది,



పల్లెటూరు

—టి. ఆదినారాయణ (14) ధర్మవరం.

# ★ వాసు చదువు ★

విశ్వం అంత చిన్నతనంలో ఆ ఆట యెలా నేర్చుకున్నాడా, అని.

"నీ పని చూడ్డమేలే...నీదంతా పల్లెటూరి తెలివి. ఇల్లాంటివేమీ చేతకావు." అన్నాడు కామేశం నవ్వుతూ. అతడిమాటలు కటువుగా హృదయానికి తగిలినయ్ వాసుకి.

"వూరుకో అన్నయ్యా: పాపం అతడే సిగ్గుపడుతుంటేనూ" అని గదమాయించాడు విశ్వం. కామేశం యింకా నవ్వుతూనే వున్నాడు కొంగతాళిగా. వాసు ఆ నవ్వుని అంతగా పట్టించుకోలేదు.

అప్పుడే వాసు వారిద్దరి మనస్తత్వాలు తెలుసుకొన్నాడు. కామేశం యెప్పటికైనా మనసిచ్చి మాట్లాడడనీ, అతని హృదయం కపటమయిందని అర్థం చేసుకొన్నాడు. అందుకే విశ్వంతో యెక్కువ చనువుగా తిరుగుతుండేవాడు.



—ఫోటో: యస్. ప్రసాదరావు.

## 6

వాసు పరీక్ష ప్యాసై ఫస్టు ఫారంలో చేర్చబడ్డాడు. క్లాసు మాస్టరు కూడా అతని తెలివితేటలకి ఆశ్చర్యపడ్డాడు. పల్లెటూరి బడికంటె కొత్త బడిలో యెన్నో వింతలు చూశాడు వాసు...నరి కొత్త మేజా బల్లలు, పీరియడ్ తెలియజేసే గంటలు, రకరకాల విద్యార్థులు...యివన్నీ వింతగానే కన్పించాయి. కొన్నాళ్లవరకు గాని క్లాసులో యెవరితోనూ స్నేహం కలుపుకోలేకపోయాడు.

పట్నం పోయాక వాసు వేషం చాలమట్టుకు మారిపోయింది. ఉన్న కొద్దిపాటి దుస్తులు శుభ్రంగా వుంచుకోవటం, తల నున్నగా దువ్వుకోవటం, రోజుకి రెండు సార్లు మొహం సబ్బుతో కడుక్కోవటం, యివన్నీ నేర్చుకున్నాడు.

పట్నం వచ్చేసి నెలరోజులయింది. ఓసారి పల్లె పోవాలనుకొన్నాడు. ఓ ఆదివారం పుదయం కాలినడకనే పల్లెటూరికి బయలుదేరాడు, అట్టే దూరం లేదుగనక. ఇల్లుచేరటంతో తల్లి వాసుని కౌగలించుకుంది. సూర్యనారాయణ క్షేమసమాచారాలు, అక్కడి పరిస్థితులు అడిగాడు. అన్నీ సవ్యంగా వున్నట్టే చెప్పాడు వాసు.

స్నేహితుడొచ్చాడని విన్న ధర్మారావు వెంటనే వాసు దగ్గరికి పోయాడు. ఒకరినొకరు చూసుకుని నవ్వుకున్నారు. ఇంట్లో వుంటే మాట్లాడే స్వేచ్ఛ వుండదని యిద్దరూ వూరిబయట గుడిదగ్గరకి పోయారు. అప్పటికి పుదయం తొమ్మిది గంటలవుతుంది. అప్పుడప్పుడు మబ్బుగా వున్నా, యెండ

తీవ్రంగానే వుంది. ఇరువురూ చెట్ల నీడని కూర్చున్నారు.

"ఎలా వున్నావ్ ధర్మా?" అన్నాడు వాసు అతడి మొహం లోకి చూస్తూ.

"నామాట కేంగానీ, నీ సంగతి చెప్పూ? స్కూల్లో చేరావా?" అన్నాడు ధర్మారావు తనో లెఖ్ఖలో వ్యక్తి కాదన్నట్టుగా.

"ఫస్టు ఫారంలో చేరానురా! నిజంగా పట్నంలో వుంటే స్వర్గంలో వున్నట్టే వుంటుంది. ఆ రోడ్లు, ఆ జనం, మోటారు కార్లూ, యివన్నీ చూస్తుంటే యెంతో హాయనిపిస్తుంది. సినీమా కూడా వుంది — మొన్ననో సినీమా చూశాను. ఎంత బావుందనుకున్నావ్?"

"అక్కడ నదివుందా?"

"వుందిగాని, చాల దూరం మా ఇంటికి ... నేనెప్పుడూపోను. ఇంట్లోనే కూర్చుంటా. ఆ యిల్లు కూడా యెలావుందనుకున్నావ్, పెద్దయిల్లే ... విద్యుద్దీపాలున్నయ్. రాత్రులు కూడా పగల్లానే వుంటుంది. అన్నట్టు మర్చిపోయాను - నీ చదువుగురించి మీ నాన్నగారేమన్నారు?" అన్నాడు వాసు. ధర్మారావు ఓ నిట్టూర్పు విడిచాడు.

"ఏమంటాడు? పాత పాటే! యీ సంవత్సరం చదువు సున్నా. యింటి పరిస్థితులు బావులేవట, వచ్చేయేడు పంపుతారట" అన్నాడు ధర్మారావు నిరుత్సాహంగా.

"అదేవిటి ధర్మా, మీలాంటి కలవాళ్లుకూడా యింటి పరిస్థితులు బావులేవంటే యెవ్వరైనా నమ్ముతారూ?"

"అదేవిటో నాకే అర్థం కాదు వాసూ: పెద్దవాళ్లు కదూ, వాళ్ల యిష్టం...సరేగానీ, పట్నం వెళ్లి నువ్వు చాలా మారిపోయావు సుమా!" అన్నాడు ధర్మారావు వాసు వేపు అదోలాచూస్తూ.

"అంటే...?" అర్థంకాక అడిగాడు వాసు.

"అంటే, నీ బట్టల్లో, ముస్తాబులో మార్పు వచ్చింది. ఇంతకు ముందు నిన్ను చూచిన వాళ్లు యిప్పుడు చూస్తే నిన్ను పోల్చుకోలేరు...గొప్ప షోకులు నేర్చావు" అన్నాడు ధర్మారావు చిన్నగా నవ్వుతూ.

"పట్నం, షోకులకి పెట్టింది పేరు ధర్మా! నేనేమూల - మొన్న మొన్న పోయిన వాణ్ణి. అక్కడి కుర్రాళ్లని చూస్తే చిత్తయిపోతావు." అన్నాడు వాసు.

"పోనీ గానీ, మన బడి పంతులు నీ గురించి అప్పుడప్పుడడుగుతూంటాడు వాసూ" అన్నాడు ధర్మారావు.

"ఇప్పుడు స్కూలుంటుంది కదూ, ఓసారి పోదాంరా" అంటూ లేచి ముందు త్రోవతీశాడు వాసు.

మిత్రద్వయం వీధివెంట పోతూంటే చాల మంది దృష్టి వాసు వేపు మళ్లింది. కొందరసూయ పడ్డారు...కొందరు సంతోషించారు స్కూలు చేరుకుండే సరికి బడి పంతులు పిల్లలకేదో బోధపరుస్తూ వాసుని చూశాడు.

"రావోయ్ వాసూ! యెప్పుడు రావటం? అవుతే నేను జ్ఞాపకం వున్నానన్న మాట" అన్నాడు నవ్వుతూ కుర్చీలో కూర్చుంటూ. వాసు పంతులికి నమస్కరించాడు.

"అదేవిటి మాష్టరుగారూ మిమ్మల్నెప్పుడైనా మర్చిపోతానా? యివ్వాళే వచ్చాను - రేపు పుదయం మళ్లీ వెళ్లిపోతాను" అన్నాడు వాసు.

"కూర్చోవోయ్ - నిల్చునే పోయావేం?" అన్నాడు బడి పంతులు. వాసు ఆ పక్కనే వున్న బెంచీపై కూర్చున్నాడు. ధర్మారావు వాసు పక్కనే కూర్చున్నాడు. వాసు వేషంలో మార్పు కనిపించటంతో క్లాసులో పిల్లలందరూ అతన్ని ఓ వింత జంతువుని చూస్తున్నట్టుగా చూశారు.

"ఏ క్లాసులో జాయినయ్యావ్ వాసూ?" మళ్లీ ప్రశ్నించాడు మాస్టరు.

"ఫస్టు ఫారంలో నండి..." సవినయంగా చెప్పాడు వాసు

"చాల సంతోషం - కష్టపడి చదివి, మీ తలిదండ్రులకీ, మన వూరికీ పేరు తేవోయ్, నీలాంటి కుర్రాళ్లు వుండటం అరుదు" అన్నాడు పంతులు. వాసు తల దించుకుని నవ్వుకున్నాడు. బడిపంతులు మళ్లీ మొదలు పెట్టాడు.

"చూడు వాసూ! పట్నంలో అనేకమైన వింతలూ, విశేషాలూ, వుంటాయి. అవన్నీ చూచి మోసపోవద్దు. కొత్తకొత్త అభ్యాసాలు అలవర్చుకోవటం మంచిది కాదు. చెప్పుకోవాలంటే దురభ్యాసాలన్నీ పట్టణంలోనే ఆలవాలమైవున్నయ్;

సంపూర్ణ శరత్ సాహిత్యం
*40 పుస్తకాలలోనూ..
14 సంపుటములుగానూ!..
వెలువడినాయి / వివరాలకు ....
దేశికవితామండలి, విజయవాడ-2

# ★ వాసు చదువు

ఒకరితో తగవులాడ్డం గానీ, ఒకర్ని దూషించటం గాని, విరోధాలు కలకాలం మనసులో వుంచుకోవటం గాని కూడదు వాసూ" అని హితోపదేశం చేశాడు మాస్టరు. అసలు మొదటి నుండి వాసంటే పంతులకి తీరని అభిమానం...

బడి పంతులు దగ్గర శలవు తీసుకుని ధర్మారావుతో వాళ్లింటికి పోయాడు వాసు. ధర్మారావు తండ్రి వాసునడిగి యెన్నో విషయాలు తెలుసుకున్నాడు. ఆ సమయంలోనే ధర్మారావు చదువు విషయం యెత్తాడు వాసు. వచ్చే యేడు తప్పకుండా పట్నం పంపుతానన్నాడు ధర్మారావు తండ్రి. తరువాత కాస్సేపు అవీ యివీ, మాట్లాడుకుని యిల్లు చేరుకున్నాడు వాసు.

ఒకే రోజులో యివన్నీ చూసుకోవటం వల్ల, యింట్లో వున్న కాలపరిమితి తక్కువయ్యింది. అప్పటికే పన్నెండు దాటింది. భోంచేసి కాస్సేపు నిద్రపోయాడు. మూడు గంటలకి లేచి మొహం కడుక్కున్నాడు. నెలరోజుల తరువాత వచ్చిన కొడుకోసం వెంకటలక్ష్మి 'వుప్మా' చేసింది. వాసు, సూర్యనారాయణ ఫలహారం చేస్తున్నారు.

"ఏంరా వాసూ! యింట్లో వాళ్లంతా అభిమానంగా చూస్తున్నారా?" అన్నాడు సూర్యనారాయణ.

"ఔను నాన్నా!" అని మాత్రం అన్నాడు. లేదని యెలా చెప్తాడు?

"ఆ పిల్లలతో నువ్వు తగవులాడకేం..." అంది అక్కడే నిల్చున్న తల్లి.

"లేదమ్మా! నాకసలు తగవులంటేనే యిష్టముండదు" అన్నాడు వాసు. తల్లి చిన్నగా నవ్వుకుంది.

"మళ్లీ యెప్పుడొస్తావురా?" అంది వెంకటలక్ష్మి.

"వీలున్నప్పుడంతా వస్తుంటానమ్మా" అన్నాడు వాసు. సాయంకాలం మరెక్కడికీ పోలేదు. ఆ రాత్రి యేమేమో కబుర్లు చెప్పుకుంటూ పడుకున్నారు. మరుచటి దినం కోడికూసే వేళకి లేచి వాసు పట్నం బయలుదేరి పోయాడు. సూర్యనారాయణ కొంత దూరం తెలతెల వారిన వరకూ సాగనంపి తిరిగి వచ్చేశాడు.

(ఇంకావుంది)


TP. 538

ఎంతో రుచికరమైనది, ఎంతో ఆరోగ్యకరమైనది



పకావ్ ఆరోగ్యము నిచ్చును: పకావ్ రుచికరమైనది—మీ భోజన పదార్థములు మంచి వంటకు వాడే సాధనతో తయారుచేయాలనుటకు అనేక కారణాల్లో యివి రెండు. ప్రభుత్వ నిర్ణీతములకు తగినట్టుగా, ఆరోగ్య రక్షక పద్ధతులతో, ఎ.డి విటమినులు కలిపి తయారగు మిక్కిలి శుద్ధత పొందిన పకావ్. పిల్లలకు పెద్దలకు ఎంతో అవసరమైన శక్తిని యిచ్చి వారి ఆరోగ్యమును సంరక్షిస్తుంది; ప్రతి వంటను విందుగా మార్చుతుంది.

సరసమైన ధరలకు 2, 10, 36 పౌన్ల డబ్బాలలో దొరకును.

# పకావ్

ఎ.డి విటమిన్లు కలిగినది

టాటా తయారు

A TATA PRODUCT



భారతదేశపు పెట్టుబడితో,
భారత నిర్వహణ క్రింద,
భారతదేశములో తయారవుతున్నది.

పెద్దకథ:

# వాసు చదువు

(గతసంచిక తరువాయి)

7

రోజులు గడుస్తున్నయ్. వాసు కనీసం నెలకోసారైనా, స్వగ్రామం వస్తూపోతుండే వాడు. సాయంకాలం తిరగటం తప్పిస్తే ఆటన్నది యెరగడు. ఆటల్లో యెన్నితగవులొస్తున్నాయో ప్రత్యక్షంగా చూస్తున్నందువల్ల ఆడాలన్న బుద్ధే కలగటం లేదు. కామేశం, విశ్వం మాత్రం ప్రతిరోజు బంతాట ఆడుకునివచ్చి యేఆటా చేతకాని వాసుని చూచి నవ్వేవారు. సమయం వస్తే యెగతాళి చేసేవారు కూడా. వాసు యివేమీ పట్టించుకోకండా వూరుకునే వాడు.

మద్దులసెట్టి హనుమంతరావు

వాసు తనకి తెలిసిన విషయాలు క్రిష్ణారావు మాష్టరు నడిగి తెలుసుకుండేవాడు. తన తమ్ముడు కొడుకులకీ అలవాటు, శ్రద్ధ లేకపోయినా కనీసం వాసు కున్నందుకు అతన్నెంతో అభినందించి, అడిగినవన్నీ విపులంగా చెప్పేవాడు క్రిష్ణారావు మాష్టరు. రాను రాను వాసుపై అవ్యాజమైన ప్రేమపుట్టుకొచ్చిందతనికి.

పరీక్షలు ప్రారంభించారు. వాసు ఒక్క నిమిషం కూడా వృథాగా పోనివ్వకండా యేదో ఒకాటి రాస్తూ, చదువుతూ వుండేవాడు. కామేశం కొన్ని నియమమైన సమయాల్లోనే చదివే వాడు. వాసుయింతశ్రద్ధగా చదవటం సీతాలక్ష్మికి వుడుకుమోత్తనమన్పించింది. కాని యేంచేస్తుంది? ఈ కోపమంతా తన కొడుకులపై రుద్దేది.

పరీక్షలయ్యాయ్ - ఫలితాలు తెలిసినయ్. వాసు క్లాసులో ఫస్టుగా పాసయ్యాడు. వాసు లాంటివిద్యార్థి తనక్లాసులో వున్నందుకు క్లాసుమాష్టరు గర్వించాడు. ముఖ్యంగా క్రిష్ణారావు మాష్టరు ఉప్పొంగి పోయాడు. వాసు పునాది దృఢతరమైందని అతను ఊహించాడు. వాసుపై అభిమానం మరింత హెచ్చయ్యింది. సూర్యనారాయణ దంపతుల ఆనందానికి మేర లేక పోయింది. వారికింతకంటె కావల్సిందేవిటి? తను వాసుని తెచ్చినందుకు మర్యాద దక్కిందనుకుంది వరహాలు.

ఇంతకూ అసూయ పడిందల్లా ఒక్క సీతాలక్ష్మే. తనకొడుకుల కెందుకలా మార్కులు రాకూ



అక్షరాభ్యాసం    చిత్రకారుడు: కలపటపు వేణుగోపాల్, బందరు.

డదు? అన్న అభిమానం ఆమెకుంది. కాని దీనికి వాసు యెంతవరకు బాధ్యుడో ఆమె ఆలోచించ లేదు. వాసునేం అనలేక వ్యంగ్యంగా కామేశాన్ని వుద్రేకంతో నాలుగు తిట్టింది. కామేశాన్ని యెందుకలా తిట్టిందో అర్థంచేసుకోలేక బిక్క మొహం వేశాడు వాసు.

కామేశంకి తెలుసు - తల్లి తన నెందుకు తిట్టిందో! అతడి కూ డా వాసుపై అసహ్యం పుట్టి అసూయ పెరిగింది. విశ్వం యివన్నీ హృదయంలో వుంచుకోకుండా మామూలుగా తిరుగుతుండే వాడు.

ఇప్పుడు సెకెండు ఫారంలోకి వచ్చాడు వాసు. కామేశం థర్డు ఫారం చదువుతున్నాడు. ఒకక్లాసు యెక్కువైనా, వాసుకున్న పాటి లోకజ్ఞానం, తెలివితేటలు కామేశంలో సున్నా. అతనిలో జీర్ణించుకున్న గొప్ప విద్య అసూయ ద్వేషాలు.

వాసు సెకెండు ఫారంకి వచ్చిం తరవాత- మొదట్నుంచీ యిష్టం లేని సీతాలక్ష్మి చిన్న చూపు చూడ్డం మొదలు పెట్టింది. ఎన్నో విషయాల్లో సీతాలక్ష్మి పక్షపాతం చూపుతూండటం గమనించాడు వాసు. కాని ఆ విషయం యెవరికీ తెలీనివ్వ లేదు. రోజుకిరోజు వాసుకి ప్రపంచజ్ఞానం అధికమౌతున్న కొద్దీ తననుభవిస్తున్న కష్టసుఖాలు అర్థమౌతున్నయ్. ముందు ఆప్తుడు, స్నేహితు డనుకున్న విశ్వం కూడా యిప్పుడు వాసుని తప్పించుకుని తిరుగుతూండటం ఆశ్చర్యమైన విషయం. అందుక్కారణం బహుశా వాసు విశ్వాన్ని చదువుకోమని బోధపర్చటమే అయి వుండొచ్చు. విశ్వం కూడా దూరమౌతున్నందుకు బాధపడ్డాడు వాసు. ఎక్కడికి పోయినా ఒంటరిగా వెళ్ళటం మరీ కష్ట మన్పించింది... మరో మార్గం యేదీ అగుపించ లేదు. ఏటిఒడ్డుకుపోయి కాస్సేపు సాయంకాలాల్లో కూర్చుంటూండే వాడు. ధర్మారావు అడిగిన ప్రశ్న యిప్పుడు జ్ఞాపకాని కొచ్చింది వాసుకి. ఏరుదూరమైనా రావల్సి వచ్చిం దిప్పుడు... ఆ యిసుక తిన్నెల్లో కూర్చున్నంత సేపూ యేవో తనకు వచ్చేపాటి పాటలు



# పిల్లి కూన

ఇంకా నేను నిద్రమంచంమీద నుండి లేవనేలేదు. ఇంతలో మా పిన్ని నన్ను లేపి "లతా ఇంకా ఎంతసేపు నిద్ర, అమ్మకు పురుడు వచ్చింది. నీ బుల్లి తమ్ముడిని చూద్దుగానిరా" అంటూ సంతోషముతో నన్ను ఎత్తుకొని పురిటి గదిలోకి తీసుకవెళ్లింది. అక్కడ అంతా హడావిడిగావుంది. ఇరుగు, పొరుగువాళ్లు, చుట్టాలు, స్నేహితులువచ్చి అమ్మని, తమ్ముణ్ణి, చూచివెడుతున్నారు. నేను దగ్గరకు వెళ్లి చూచాను. చిన్న చిన్న కాళ్లు చేతులు ఆడిస్తూ, పచ్చటి శరీరము నల్లని జుట్టు బుల్లినోరు, తమ్ముడు ముద్దు వస్తున్నాడు.

అందరు తమ్ముణ్ణిగురించే మాట్లాడుతూ ఉన్నారు. మా ఇంటి ప్రక్కవిడ నాకేసిచూసి "లతా నీ పని అయిందిలే. నీ ఆటలు ఇంక సాగవులే ఇంక నువ్వు మా కొద్దు. మీ తమ్ముడినే ఆదరిస్తాం" అంది నవ్వుతూ. నా మనస్సు చిన్నబోయింది. నా సంతోషము మరుక్షణమే మాయమైంది. నేను అయిదు సంవత్సరాలనుంచి ఆక్రమించిన స్థానం ఈనాడు ఈకొత్త తమ్ముడు ఆక్రమించుకొని, నన్ను అమ్మ నుండి వేరుచేస్తూన్నట్లనిపించింది. అమ్మ తనదేఅయినట్లు గుప్పెట్లు పట్టుకున్నాడు. నాకు గట్టిగా ఏడ్వాలనిపించింది. అక్కడనుంచి చల్లగా జారి యివతలకు వచ్చేసేను.

చిన్నబోయి వంటరిగా ముందు గదిలోకి పోయేను. ఒక తెల్లటి పిల్లికూన అక్కడకువచ్చి నా విచారాన్ని పోగొట్టింది. నాసంతోషానికే ఈపిల్లికూనని దేవుడు పంపించినట్లనిపించింది. మా అమ్మ తమ్ముడిని

నిమ్మగడ్డ స్వర్ణలత

ఆడిస్తూ ముద్దు పెట్టుకుంటే, నేను ఈ పిల్లిపిల్లను ఆడిస్తూన్నాను. నాసంతోషాన్ని పట్టలేక నా పుస్సీని (పిల్లికూన) అమ్మకు చూపిద్దామని తీసుకువెళ్లాను. అమ్మ నన్ను పుస్సీని, తమ్ముణ్ణి ఒక్కమాటు చూచింది. ఆరోజునుంచి అమ్మకు మేము ముగ్గురము సంతానమే అన్నట్లు చూచింది.

పిల్లికూనను చూచి మొదట మానాన్నగారు రోజు పిల్లిదర్శనం మంచిదికాదని కోప్పడ్డారు. కాని పుస్సీ 'మ్యావ్-మ్యావ్' అంటూ ఆయనచుట్టూ తిరిగేటప్పటికి, ఆయన హృదయంకూడా కరగిపోయింది. దానికి రోజూ భోజనం పెట్టేవారు. నిత్యం దానికి మాతో సహావంక్తి భోజనం అలవాటయింది. భోజనం [illegible] కునేదాన్ని. మజ్జిగ పోసుకోవడం తడువుగా 'మ్యావ్' అంటూ మూతి దగ్గర పెట్టేది.

పుస్సీనివదలి ఒక్కక్షణంకూడా వుండలేకపోయేదాన్ని. మా అమ్మ తమ్ముణ్ణి అలంకరిస్తే, పుస్సీ నాదగ్గర ముస్తాబు అయ్యేది. రాత్రి నిద్రపోయేటప్పుడుకూడా మెత్తగా, వెచ్చగా బుల్లిబొజ్జమీద పడుకోపెట్టుకొనేదాన్ని. పుస్సీని వంటరిగా వదలి ఎక్కడకి వెళ్లడానికీ నాకు మనస్సు ఒప్పేదికాదు. నేను లేకపోతే దానిని ఎవరైనా ఎత్తుకుపోతే, ఏ కారు క్రిందకాని పడితే, ఏకుక్కైనా దాన్ని చంపేస్తే-నేను ఎల్లా బ్రతకగలను అనిపించేది.

ఆరోజు దసరా పండుగ. మా అమ్మ సేమ్యాపాయసం, ఆవడలు చేసింది. అమ్మ పేరంటానికి పిలుచుటకు వెళ్లినది. తిరిగి వచ్చేసరికి పిల్లికూన పాయసం, ఆవడలు, అంతా వలకపోసి నాకుతూంది. మాఅమ్మకు చాలాకోపమువచ్చింది. నేను చిన్నబోతానని మా నాన్నగారు ఏమీ అనకుండా ఊరుకున్నారు.

మాపిన్ని పెళ్లిట. శుభలేఖ వచ్చింది. పిన్ని అంటే నాకెంతో, ఇష్టము. మా అమ్మ పురిటికి వచ్చినప్పుడు నన్ను పుస్సీని ఎంతో ప్రేమగా చూచేది. పుస్సీనికూడా పెళ్లికి తీసుకువెళ్లాలి అనుకున్నాను. 'మనము పెళ్లికి వెళ్లి వచ్చేవరకు పుస్సీని ఈ ఊరిలో అత్తయ్యగారింటో ఉంచుదాం' అంది మా అమ్మ.

## వాసు చదువు

పాడుకుంటూ ఆనందించే వాడు. ఇలా ఓ వారందినాలు గడిచిపోయాయ్. జీవితం నిస్సారంగా, భారంగా గడుస్తున్నట్టుగా భావించే వాడు వాసు. కాని తనేంచేస్తాడు?

పెద్దకథ:

# ★ వాసు చదువు ★

(గతసంచిక తరువాయి)

## 8

పట్నంలో స్నేహితులంటేనే భయపడే వాడు. అందుకే మొదటి సంవత్సరం వింతవ్యక్తిలా అందరికీ దూరంగా తిరిగేవాడు. కాని సెకెండుఫారంకి వచ్చిం తరువాత తప్పించుకోలేకపోయాడు. తెలివైన వాడన్న ప్రతీతి రావటం వల్ల యెంతో మంది వాసుతో స్నేహం చెయ్యాలని వుబలాట పడుతుండే వారు. కాని అందరికీ అది సాధ్యం కాలేదు. వకీలుకొడుకు రాజు, డాక్టరు మేనల్లుడు సీతారాం, మాత్రం వాసుతో స్నేహంచెయ్యటంలో విజయం పొందారు. వారే రానురాను విడవని స్నేహితులయ్యారు కూడా. కాని—

వాళ్ళతో కల్సి పోతున్నందుకు అప్పుడప్పుడు వాసు సిగ్గుపడుతుండే వాడు. ఎందుకూ అంటే, వాళ్ళదుస్తులతో తన దుస్తులు సరిపోల్చుకున్నాడంటే వాసుకే అసహ్యమేస్తుంది. వాళ్ళు రెండురోజులకే దుస్తులు విడుస్తుండేవారు. కాని వాసు వారం రోజులకి కాని దుస్తులుమార్చేవాడు కాదు. ఏంచేస్తాడు? వాళ్లలా యెలా మార్చగలడు? మార్చే తాహతులేదు ... వాళ్ళంటే శ్రీమంతుల బిడ్డలుఅని తనలో తనే సమాధానపడేవాడు. మొదట్లో యీ విషయమై మానసికంగా బాధ పడినా, తరవాత అలవాటు పడి పోయాడు.

రాజు, సీతారాంలకి వాసు నిజ పరిస్థితి తెలుసు. ఆర్థికంగా వాసు తమ తాహతుకి సరిపోడని తెలుసు. అయినా వారి హృదయాలు నిష్కల్మషమైనవి. ధనికుల హృదయాలు కావు. హృదయం మంచిదవుతే బాహ్యావేషం యెలావుంటే నేం? అనేవారు.

వాసు ధనిక వర్గంతో స్నేహం చెయ్యటం కామేశానికి కన్నుకుట్టినట్టయింది. తల్లి సీతాలక్ష్మితో వున్నవీ, లేనివీ కొన్ని చాడీలు వాసుపై చెప్పాడు... తనతో తిరిగేందుకు వాసుకి చిన్నతనమనీ, తన మొహం చూస్తే పెద మొహం పెడతాడనీ, ధనవంతులతో స్నేహం చేశానని గర్వపడుతుంటాడనీ, యింకేమేమో చెప్పాడు. కొడుకు చెప్పిన వన్నీ అక్షరాలా నిజమనుకుంది సీతాలక్ష్మి. ఆమెలో అగ్నిపై ఆజ్యం పోసినట్టుగా మరింత అసూయ ప్రజ్వరిల్లింది వాసుపై.

ఓనాడు వాసు, రాజు, సీతారాం కలిసి నదిఒడ్డుకి పోయారు. ఆ నిర్జన ప్రదేశంలో కూర్చున్నారు ముగ్గురూ. వాసు పాడతాడని రాజుకి తెలుసు. ఒక పాట పాడమన్నా రిద్దరు స్నేహితులూను. బలవంత పర్చారు. పాడక తప్పింది కాదు. ఓ చిన్నపాట శ్రావ్యంగా పాడాడు వాసు. రాజు, సీతారాంలు ఆశ్చర్యపోయారు వాసు అంత బాగా పాడినందుకు. తిరిగి వచ్చేస్తున్నప్పుడు సినిమాహాలు ప్రక్కనుండి రావటం తటస్థించింది. అప్పుడు ఆడుతున్న 'సంసారం' సినీమా చూడాలన్న వాంఛ కలిగింది రాజుకి. తన అభిప్రాయాన్ని సీతారాంకి తెలియజేశాడు రాజు. ఇద్దరూ పోదామంటే పోదా మను కున్నారు. కాని వాసుమాత్రం నిరసన చూపాడు.

"ఏవిటి వాసూ! ఎప్పుడూ యింతేనా? సినిమా చూడకండా యెలా వుంటున్నావో అర్థం కాకండా వుంది" అన్నాడు రాజు. వాసు నవ్వాడు.

"ఇది ఓనిషాలాంటిది. చవి చూస్తున్నకొద్దీ ఆసక్తి యెక్కువౌతుంది ... చూడాలని వుంటే వీలుండొద్దూ?" అన్నాడు వాసు మంచి కుర్రాడిలా.

"నువ్వలా గంటావని నాకు తెలుసు వాసూ! కాని యేంచేయను నువ్వన్నట్టు యిది ఓ నిషాయే... ఈ ఒక్కసారికి నీకు నిషా అయిపోదుగా" అన్నాడు నవ్వుతూ సీతారాం.

"నిషా మాటకేంగాని, నేనింట్లో చెప్పలేదు సీతారాం" తను భయ

# ★ వాసు చదువు ★

పడుతున్న విషయాన్ని స్పష్టంగా చెప్పేశాడు.

"చెప్పకపోతేనేం...మళ్లీ 9 గంటలకి తిరిగి పోతాంగా"

"అదికాదు సీతారాం...నేనున్నది పరాయివాళ్ల. యిల్లు స్వంత యిల్లయితే ఫరవాలేదు. ఇప్పటికే యెన్నో అంటుంటారు. వాళ్ల నడక్కుండా సినీమాకిపోతే వూరుకుంటారూ?" అన్నాడు వాసు.

"అదేమిటి వాసూ! యిలా ఝడిసి తిరిగితే మరీ నెత్తినెక్కుతారు." అన్నాడు రాజు కాస్త వుద్రేకంగా.

"నీకు తెలీదు రాజూ..." అంతే అనగలిగాడు వాసు. ఏదో చెప్పాలనుకున్నాడు కాని, అభిమానం అడ్డొచ్చింది.

"ఈ ఒక్క రోజూ రావోయ్-ఒకసారి నిశ్చయించుకున్న తరవాత మళ్లీ మనసు మార్చుకుంటే చికాగ్గా వుంటుంది. మాష్టారుగారింటికి వెళ్లానని చెప్పకూడదూ?" అన్నాడు సీతారాం వుపాయం చెప్తూ.

వాసుకి అబద్ధం చెప్పటం అంటే మహాభయం. వీలయినంతవరకూ నిజం చెప్పటానికే ప్రయత్నిస్తుంటాడు. "అసలు విషయమే చెప్పేద్దాం - అబద్ధమాడ్డం ఎందుకు గాని..." అని మధ్య సంశయార్థంగా ఆపేశాడు వాసు. కాని అన్న పదానికి అర్థం దొరకలేదు తక్కిన యిద్దరికి. బహుశా డబ్బులు లేకేమో, సంశయిస్తున్నాడనుకున్నాడు రాజు.

"కాని యేమిటి వాసూ! డబ్బులు తేలేదా?" అన్నాడు. నిజానికి వాసుదగ్గర డబ్బులు కూడా లేవు. అయినా ఆ 'కానీ' అన్న మాట అందుకనలేదు. ఇంకా భయం వుండనే వుంది సీతాలక్ష్మి యేమంటుందోనని.

"ఫరవాలేదులేవోయ్ — మేం వున్నాంగా." అన్నాడు సీతారాం.

"నాకోసం మీరు టిక్కెట్ కట్టడం నాకిష్టంలేదు సీతారాం" అన్నాడు వాసు.

"అలాగంటే మన స్నేహానికర్థమేముంది వాసూ" అన్నాడు రాజు. వాసు మరి మాట్లాడలేక పోయాడు.

* * *

వాళ్లిద్దర్లో యెవరో ఒకరు వాసు కోసం టిక్కెట్టు కొన్నారు. అదీ రూపాయి పావలా టిక్కెట్. వాసుకిదేం నచ్చలేదు సరిగదా, బాధ కల్గించింది. సినీమా చూడకపోతే పోయెగాని పరాయివాళ్ల పైసాతో చూచియేం లాభం? అన్న అభిమానం అతని ఆలోచనకి తట్టింది. కాని యేం చేస్తాడు? వాళ్లంతగా పట్టుపట్టి రమ్మంటే—

వాసు సినీమా చూస్తున్నాడే గాని, మనసులో సీతాలక్ష్మి యేమంటుందోనన్న భయం పీక్కుతింటోంది. ఉత్సాహం అన్నది అతనిలో లేకపోయింది. ఏవో నన్నివేశాల్లో అందరూ నవ్వుతూ వుంటే వాసు కూడా నవ్వేసేవాడు బాధగా. ఇంటర్వల్ అయింది. వాసుని యిద్దరు స్నేహితులు చెరో చేయి పట్టుకుని కాఫీహోటలికి నడిపారు. మొదటే బాధపడుతున్న వాసు కిది మరింత నొప్పి కలిగించినట్టయ్యింది. తనేదో వాళ్లకి బాకీ పడ్డట్టుగా భావించి బాధపడ్డాడు.

సినీమా పూర్తయింది. ముగ్గురు బయటికి వచ్చారు. రాజు, సీతారాం ఒకరివెనుక ఒకరు వాసుని ప్రశ్నలడుగుతున్నారు. 'ఎలావుంది సినీమా?' 'బావుందా?' 'పాటలెలా ఉన్నయ్?' హీరోయిన్ బావుంది కదూ?' యిలాంటి వెన్నో కాని వాసు తన మనసులో వున్న అభిప్రాయాలు అప్పుడు వెల్లడి చేయలేకపోయాడు. ఎప్పుడు యిల్లు చేరుకుంటానా, యింట్లో పరిస్థితులు యెలా వుంటాయా' అన్నవే అతని మెదడులో పనిచేస్తున్నయ్. సినీమా బాగానే వుందన్న జవాబు మాత్రం యివ్వగలిగాడు. వాళ్లిద్దరు కూడా అట్టే ఒత్తిడిచెయ్యలేదు. తరువాత యెవరి యింటికి వాళ్లు త్రోవతీశారు.

వాసు యిల్లు చేరుకునే సరికి తొమ్మిదిన్నరయింది. భయంతో కాళ్లు వణుకుతున్నయ్. మెల్లగా అడుగులు వేసుకుని యింట్లోకి పోయాడు. కామేశం గదిలో కుర్చీపై చదువుతున్నట్టు పుస్తకం చేతులో వుంచుకుని నిద్రపోతున్నాడు. సీతాలక్ష్మి మధ్య గదిలో పడుకునుంది. ఇంకా నిద్ర పట్టలేదుగామోసు యిటూ, అటూ ఒత్తిగిలుతూంది. విశ్వం అరుగుమీద చదువుకుంటున్నాడు కునుకుపాట్లతో. ఏంచేయాలో తోచలేదు వాసుకి. ఆ సమయానికి మేనత్తలు వూర్లో లేకపోయినందుకు యెంతో చింతిం

చాడు. చదువుతున్న విశ్వం దగ్గరికొచ్చి కూర్చున్నాడు.

"వంటగదిలో వడ్డించాం - తినమనరా విశ్వం..." అంది సీతాలక్ష్మి విసురుగా మంచంమీది నుంచే. విశ్వం చెప్పకుండానే అర్థం చేసుకున్నాడు వాసు. ఆమె మాటల్లో యెంత కరకుదనం వుందో వాసుకి తెలీక పోలేదు. మెల్లగా వంటగదికి పోయి చప్పుడు కాకుండా తినిలేచాడు. ఏదో అర్థం కాని ఆవేదన వాసుమనసులో నొప్పి కలిగిస్తూంది. ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తున్నాడు.

సీతాలక్ష్మి వంటగది చక్కబెట్టుకుందుకు చరచరా వచ్చింది. ఆమె కోపంగా వుందని వూహించ గలిగాడు వాసు.

"రాత్రి పదిగంటలవరకూ యీ యింట్లో భోజనాలు పూర్తికావు... ఏ జన్మలో ఋణపడివున్నామో గాని యిప్పుడు అనుభవిస్తున్నాం" అంది గట్టిగా. తరువాత యింకేమో లోలోన గొణుక్కుంది గాని వాసు కవి వినిపించలేదు.

ఆమెమాటలు వాసు హృదయంలో అంకుశాల్లా నాటుకుపోయాయ్. ఆత్మాభిమానం లేని చచ్చులా నోరుమూసుకున్నాడు. ఏం చేస్తాడు? తనలో తప్పుంది. ఆమె యేమన్నా, యెన్ని తిట్టినా, పడాల్సిందే!


"ఇంత రాత్రివరకేం చేస్తున్నావ్ వాసూ?" చివరకు అడక్కుండా వుండలేకపోయింది, సీతాలక్ష్మి. వాసు ఆమె కేకకి త్రుళ్లిపడ్డాడు.

"సినీమాకి వెళ్లేనక్కయ్యా" చెప్పలేక చెప్పాడు వాసు.

"ఔనుమరి...నాకు తెలుసు. నీకిప్పుడు స్నేహితులు, సినీమాలు, యెక్కువయ్యాయ్. ఎందుక్కావూ? అడిగే మనిషి, అడ్డుపెట్టేవాళ్లు యెవరైనా వుంటే కదూ!" అంది కోపంగా.

వాసు కివి అగుపించని అంకుశాల్లా గుచ్చుకున్నాయ్. మాట మురుసు లేకపోబట్టి సరిపోయింది. లేకపోతే యేమచేసేవాడో! ఎదురిచ్చి మాట్లాడ్డానికి ధైర్యం లేకపోయింది. తన తప్పిదాన్ని ఒప్పుకోక తప్పిందికాదు.

"నేను వద్దంటే, నన్ను బలవంతంగా స్నేహితులు తీసికెళ్లారక్కా. నీకు చెప్పిపోయేందుక్కూడా సమయం లేకపోయింది. మరెప్పుడూ ఇలా వెళ్లనక్కా..." అని ప్రాధేయపడుతూ చెప్పాడు వాసు.



ఫొటో కోసం పోజు

—డి. రామలింగేశ్వరరావు.

# ★ వాసు చదువు ★

"మాటలు నేర్చావు...ఏ పెద్దవాళ్లయినా మాటలకి నీ దగ్గర పనికిరారు. నిన్ను నా నెత్తిమీదికి తెచ్చిపెట్టారు ... ఎవళ్లు దేం పోయింది? అనుభవిస్తున్నది నేను కదూ!" అంది కాస్త పెద్దకంఠంతో.

అంతవరకు నిద్రలోవున్న కామేశం లేచి గదినుండి వచ్చాడు.

"సినిమాకేనా అమ్మా వెళ్లాడూ?" అడిగేడు, అక్కడికి తనే మహా బుద్ధిమంతుడిలా.

"కానురా...అదే అడుగుతున్నా...కనీసం చెప్పిపోతే ఏం పోయిందీ, అని" అంది సీతాలక్ష్మి కొడుకువేపు తిరిగి.

"అబ్బే! ఆయనెందుకు చెప్తాడు? చెప్తే చిన్నతనం కదూ! పెద్దపెద్ద స్నేహితులు దొరగ్గా మనం ఎందుకు పనికొస్తాం" అన్నాడు కామేశం తన కసితీరేట్టుగా.

వాసు చిన్నబుచ్చుకున్నాడు. ఇంక వాదించి లాభం లేదనుకొని నోటికి తాళం వేశాడు. తన తప్పిదాన్ని మౌనంగా ఒప్పుకొన్నాడు. ఆరోజు ఎంతోసేపు లోలోన కుమిలిపోయాడు.

## 9

మరుచటి రోజు వాసు క్లాసుకి పోయాడేగాని అదోలా వుండటం గ్రహించాడు రాజు. అతని హృదయంలో ఏదో తుఫాను చెలరేగిందనుకొన్నారు. సాధారణంగా పిల్లల హృదయపు లోతులు పిల్లలే కనుక్కోగలుగుతారు.

"ఏం వాసూ! అదోలా వున్నావ్? మీ అక్కయ్య ఏమన్నా అన్నదా?" అడిగేడు రాజు.

"అనివుంటుంది. లేకపోతే ఎప్పుడూ కలకల్లాడే ముఖం ఎందుకిలా వుంటుంది?" అని తాళం వేశాడు సీతారాం.

తన కష్టసుఖాలు తెలుసుకొనే ఆప్తులు పట్నంలో వీళ్లిద్దరేనేమో ననుకున్నాడు వాసు అప్పట్లో; అతనికళ్లు నీళ్లపర్యంతమయ్యాయ్.

"నేను మొదటే చెప్పానుకదూ రాజూ! మా అక్కయ్య నడిగిరాలేదని. ఎన్నో చీవాట్లు పెట్టింది. చీవాట్లతో సరిపోయిందా, మనసుని బాధపెట్టే మాటలెన్నో అంది. పోనీ పెద్దవాళ్లన్నందుకు అట్టే బాధపడలేదు కాని, కామేశం కూడా మరికొన్ని వెటకారపు మాటలాడి తల్లి కౌర్యాన్ని రెట్టించాడు." అన్నాడు వాసు బొంగురుపోయిన కంఠంతో. అంతవరకూ యిల్లాంటి విషయాలెవ్వరితోనూ చెప్పలేదు వాసు. ఇప్పుడు చెప్పక తప్పిందికాదు.

"మేం మొదట అనుకొన్నదే.. అయితే నువ్వేమన్నావ్?" అన్నాడు సీతారాం.

"ఏమంటాను? నోరు మూసుక్కూర్చున్నా. వాళ్లెన్నన్నా జవాబివ్వలేదు." బాధగా చెప్పాడు వాసు.

"నువ్వు మరీ వూరకపోయావు వాసూ! నీ జాగాలో నేనున్నానుకాదు... ఏం చేసేవాణ్ణో...!" అన్నాడు రాజు తన ఆధిక్యత కనబరుస్తూ. "నాలాంటి పరిస్థితుల్లో వుండి నువ్వా ఆ జాగాలో వుంటే నాకంటె అధికం నువ్వేం చెయ్యలేవు రాజూ! నీ పరిస్థితిలో, నేనుంటే, పరాయివాళ్ల యింట్లో చదువుకునేందు కెందుకుంటాను చెప్పు?" ఏదో పరమరహస్యాన్ని విప్పి విపులంగా చెప్పినట్టు చెప్పాడు వాసు.

అర్థం చేసుకొన్న రాజు, సీతారాం, ఒకరి ముఖం ఒకరు



చూసుకొన్నారు. ఒక్క నిట్టూర్పు విడిచారు.

"నిజమే వాసూ! ఇప్పుడంతా అర్థమయ్యింది. మరేం బాధపడకు. భగవంతుడే వున్నాడు" అన్నాడు రాజు ధైర్యం చెబుతూ. అంతకంటే యెవరు మాత్రం యేం చేయగలరు?

ఇంతలో మాస్టరు వచ్చారు. మళ్లీ యథావిధిగా చదువు ప్రారంభమయింది. టైం అయిపోయింతరువాత స్కూలు విడిచిపెట్టారు. అందరూ ఒహార్నహారు నెట్టుకుంటూ పోతున్నారు. వాసు రాజు, సీతారాంలమధ్య నడుస్తున్నాడు. వాళ్ల పక్కనుండే కామేశం ఒంటరిగా తొందరగా అడుగులు వేసుకొంటూ పోతున్నాడు.

"ఏమిటోయ్ కామేశం యింత తొందరగా పోతున్నావ్? ఇంకేమైనా చాడీలు చెప్పటానికి మిగిలిపోయాయేమిటి?" అన్నాడు రాజు నవ్వుకుంటూ. వాసువద్దని మధ్యలో మొఱపెట్టుకొన్నా వినిపించుకోలేదు. సీతారాం ఫక్కుననవ్వాడు. కామేశం కాలుకాలినపిల్లిలామరింత జోరుగా నడుస్తూ గుడ్లు పెద్దవిచేసి వాసువేపు క్రోధంగా చూశాడు. వాసు బిక్కచచ్చిపోయాడు అప్పటికే. అంతా అరువు బ్రతుకతనిది.

వాసు యిల్లుచేరుకునేసరికి, కామేశం తల్లితో యేమిటో వాదిస్తున్నాడు. తనగురించే గామోననుకుని మెల్లగా అడుగులు వేసుకొంటూ లోపలికి పోయాడు. వాసు రావటం తల్లీ, కొడుకుల్లో యెవ్వరూ గమనించలేదు. విశ్వం, గదిలో కూర్చుని పత్రిక చదువుతున్నాడు. వాసు రావటంతో పత్రిక మూసేసి:

"ఏమయిందోయ్ వాసూ! మా అన్నయ్య నీమీద పెద్దవుపన్యాసం యిస్తున్నాడు...నీ స్నేహితులచే అవమాన పరిపించావుటకదూ!" అన్నాడు. వాసు అంతకుముందే యీ కల్పన జరుగుతుందనుకొన్నాడు. అందుకే ఆశ్చర్య పడలేదు.

"నే నేమైనా అనిపిస్తానంటే నువ్వు నమ్మతావా విశ్వం? అసలు నే నతన్ని అవమానపర్చడాని కెందుకు ప్రయత్నిస్తాను చెప్పు? రాజు లేడూ...వాడనేశాడు. నే నప్పటికీ వారిస్తూనే వున్నాను...వినిపించుకుంటే కదూ!" అని నిస్సహాయతనీ, నిర్దోషిత్వాన్నీ తెలియబర్చుకున్నాడు వాసు. వాసు సంగతి తెలిసిన విశ్వం యిది నమ్మదగ్గదే అనుకొన్నాడు. కాని తనుమాత్రం యేంచేస్తాడు? వాసుని వెనకేసుకెళ్తాడా! అలాగవుతే వీపు పెట్లుతుందని తెలుసు విశ్వంకి. ఊరుకున్నాడు. ఇంతలో కామేశం రుసరుసలాడుతూ వచ్చాడు గదిలోకి. ఎవ్వరితోనూ మాట్లాడకండా పుస్తకం పట్టుకొన్నాడు. వాసుగది నుండి బయటికి జారుకున్నాడు.

వాసు మనసు స్థిమితంగా లేదు. చీటికీ మాటికీ కామేశం యెందుకట్లా చీదరించుకుంటాడో అర్థం కాలేదతనికి. మనసిచ్చి మాట్లాడని కపటవ్యక్తుల సామీప్యంలో తిరుగుతూండటం కష్టంగానే తోచింది. కాని యేంచేస్తాడు? తనభవిష్యత్తు కోసం చదువుకోవాలి! యెన్ని బాధ లనుభవించినా చదువుకోవాలి!!

మరుచటిరోజే సీతాలక్ష్మి కలకత్తాలో వున్న భర్తకి, మర్దలకి వుత్తరం రాసింది; వాసు ప్రవర్తనయేం బావుండలేదని, రోజుకిరోజు మితిమీరిపోతున్నాడని. ఉన్నవి, లేనివి మరికొన్ని, కల్పించి రాసింది. ఆ సంగతి పాపం వాసుకి తెలీదు. ఓ ఆటబొమ్మలా వాళ్ళేం చెప్తే అది చెయ్యటం, తన చదువు చదువుకోవటం. అంతే! సినిమాలు కూడా మానేశాడు.

వాసు ముందుగానే జాగ్రత్త పడితే బాగుంటుం దనుకున్నాడు. రాజు అన్నమాటలు యెంతవరకు దారితీశాయో, రాజుతోనే చెప్పాడు. కామేశం యింత కుగిలీ కోరని, ప్రతిమాట యింట్లో చెప్తాడని యెప్పుడూ అనుకోలేదు రాజు. వాసు బాధపడుతున్నందుకు సానుభూతి చూపుతూ తన దురుసుతనానికి నొచ్చుకుని క్షమాపణ కోరుకున్నాడు. వాసు వాళ్లతో తిరగటం అంతగా లేకపోయినా, రాజు, సీతారాం, మాత్రం వాసు చెలిమిని కోరుతూ అతన్ని విడువలేకపోయారు.

వరహాలు, రత్నాలు, హైద్రాబాదు నుండి తిరిగివచ్చారు. సీతాలక్ష్మి అత్తతో వాసుపై తను కలకత్తా రాసిన వుత్తరంలోని సంగతులన్నీ విడమర్చి చెప్పింది. వరహాలు నివ్వెరపోయింది. వాసు ఒహర్ని అవమానపర్చాలని ప్రయత్నిస్తాడంటే ఆమె నమ్మలేకపోయింది. కాని కాస్తయినా నిజం లేకపోతే కోడలు చెప్పదనుకుంది. వాసుని నాలుగు చీవాట్లు పెట్టింది. అంతే కాదు; యిక ముందిలాంటి దేం విన్నా చదువు యెత్తివేయవల్సి

# ★ వాసు చదువు ★

వస్తుందని భయపెట్టింది. చదువు మాన్పిస్తా మనటంతో వాసు మరీ కంపించిపోయాడు. తను యింత దూరం తలిదండ్రుల్ని విడిచి రావటం యెందుకు! అన్న ఆలోచన తట్టిందతనికి. అప్పట్నుంచి స్నేహితులతో తిరగటం అరుదయ్యింది. తీరికసమయాల్లో యెప్పుడూ యింట్లోనే వుండేవాడు.

## 10

క్లాసుల్లో పాఠాలు మొదలు పెట్టి నెలరోజులయింది. వాసు ధర్మారావు వస్తాడేమోనని చూస్తూనే వున్నాడు. వస్తే కన్పించడూ మరి...ఏమో, మళ్లీ యేం అవాంతరం వచ్చిందోనని విచారించాడు.

ఓరోజు వుదయం రెండో పీరియడ్‌లో వాసు, రాజు, సీతారాంతో కలిసి బయటికి వచ్చారు. అప్పటి కింకా మాష్టరు క్లాసుకి రాలేదు. మళ్ళీ వెంటనే తిరిగిపోవచ్చనుకున్నారు. గేటుదాటి బయటకి వస్తూంటే యెదురుగా ధర్మారావు వస్తుండటం చూశాడు వాసు. వాసు ఆనందానికి అంతులేకపోయింది. ఇద్దరూ తృప్తిగా నవ్వుకున్నారు.

"ఏం ధర్మా! యిప్పుడు రావటం?" అన్నాడు వాసు.

"మూడురోజులయింది వాసూ! నీకోసం చూశాను నువ్వెక్కన్పించలేదు" అన్నాడు ధర్మారావు.

"నువ్వొస్తావని ప్రతిరోజు యెదురుచూస్తున్నా తెలుసా! అం... అవుతే యీ సంవత్సరం జాయిన్ అవుతున్నావా?"

"అప్పుడే జాయిన్ అయిపోయాను వాసూ"

"ఏ క్లాసులో...?"

"ఫస్టుఫారంలో"

"అనవసరంగా ఓ సంవత్సరం వ్యర్థమయ్యింది ధర్మా" అన్నాడు వాసు నిట్టూరుస్తూ.

"మరేం చేస్తాంలే..." నవ్వూ ధాన పర్చుకున్నాడు ధర్మారావు.

"ఏం వాసూ! ఒక సంవత్సరం యెందుకు వ్యర్థమయ్యింది?" ప్రశ్నించాడు సీతారాం.

"మా యిద్దరం ఒకే సంవత్సరంలో అయిదో క్లాసు పాసయ్యాం సీతారాం. నేను వెంటనే యిక్కడికొచ్చి జాయినయ్యాను. వీడికి వీల్లేక, యీ సంవత్సరం వచ్చాడు" చెప్పాడు వాసు.


**101** మందికి మా పోటి నెం. 26 లో బహుమతులు యివ్వబడినవి. *I* వ బహుమతి: (1) సి పాపా నాయక్, చిత్రదుర్గ్; (2) ఎస్. జి. సింగ్ దత్తా, జమ్మూ; (3) కిశోరి లాల్ శారద, ఫిరోజ్ పూరు; (4) ఎమ్. సిద్ధరామప్ప, బెల్ హారి; (5) ఓమ్ప్రకాష్ శర్మ, జలందరు సిటీ మరియు 18 మంది; *II* వ బహుమతి 3 రు; *III* వ బహుమతి 71 మంది; మరియు *IV* వ బహుమతి 5 మంది. పూర్తి వివరాలు కోరువారు 4 అణాల తపాలా బిళ్ళలు పంపవలసినది.

**గెలవండి 25,000 గెలవండి**

రిజిష్టర్డు నెం. **628** — పోటి నెం. **28**




సీలు వేసియున్న మా అఫిషియల్ కీ సొల్యూషన్ మెసర్సు. ప్రీమియర్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, మద్రాసు వారివద్ద డిపాజిట్టు చేయబడియున్నది. వారి అధికారముతో అది ప్రకటించబడును ప్రథమ బహుమతి ఆల్ కరెక్టు రు. 12,500. రెండవబహుమతి, మొదటి రెండు లైనులు కరెక్టు రు. 6,500. మూడవ బహుమతి, మొదటి ఒక లైన్ కరెక్టు రు. 3,500. నాలుగవ బహుమతి మొదటి రెండు నెంబర్లు కరెక్టు రు. 2,500 మా కీ సొల్యూషన్ ప్రకారం నిలువుగా, అడ్డంగా యెటైనా వుండవచ్చును.

484

**ఆఖరు తేది 27-11-54 ఫలితములు 13-12-54**



ప్రవేశ రుసుము ఒక ఎంట్రీకి రు. 1/-; 6 ఎంట్రీలకు రు. 5/-; 14 ఎంట్రీలకు రు. 10/-

సాల్వ్ చేయవలసిన విధానము :—ఈ చదరములో 101 నుండి 116 వరకు గల అంకెలు నిలువునా అయినాలలా అడ్డముగా ఎటు కూడినా 434 వచ్చేట్లు వేయాలి. ఒక అంకె ఒకసారే వాడాలి. రూల్సు :—సాదా కాగితము మీద ఎన్ని ఎంట్రీలైనా నిర్ణయించిన సొమ్ముతో పంపిన అంగీకరింపబడును. ప్రతి ఎంట్రీకింద, పోటీ పంపువారు తన పేరు అడ్రసు స్పష్టంగా పెద్ద అక్షరాలతోను, అంకెలతోను ఇంగ్లీషులో వ్రాయాలి. సొమ్ము క్రాస్ చేసిన ఇండియన్ పోస్టల్ ఆర్డర్లుగాగాని, మనియార్డర్లుగాగాని పంపవచ్చును. మనియార్డరులైనచో మనియార్డరు రశీదులు పోటీ యెంట్రీల వెంట పంపవలెను. ప్రతి మనియార్డరు ఫారములోని కూపనులో సొమ్ము పంపువారు తన పేరు, అడ్రసు ఇంగ్లీషులో వ్రాయవలెను "వసూలునుబట్టి బహుమతుల సొమ్ము మారుచుండును." ఈ పోటీలో మేనేజరు తీర్మానము ఆఖరు చట్టబద్ధమైనది. 0.4.0 స్టాంపులు పంపిన పోస్టులో ఫలితముల లిస్టు పంపబడును. మా ప్రత్యేక రూల్సు, షరతులు బాగా తెలిసినవారే పోటీలో పాల్గొనవలెను.

**THE RAISING COMPETITIONS No. 28, 28 (3), Thandavaraya Gramani St., MADRAS-21.**

"అయినా యేంపోయిందిలే! పునాది దిట్టంగా వుంటుంది" అన్నాడు రాజు చిన్నగా నవ్వుతూ.

"ఎలాగో సమాధానపడాలి మరి" నవ్వుతూనే అన్నాడు వాసు.

"వస్తాను వాసూ" బయలుదేరాడు ధర్మారావు.

"సరే...గాని సాయంకాలం స్కూలు విడిచాక గేటుదగ్గరుండు. మా యింటికొద్దువుగాని..." అన్నాడు వాసు. అలాగే నన్నట్టుగా తలూపుతూ పోయాడు ధర్మారావు.

"చిన్నతనం నుండి అరమరలేకండా మెలగుతూ వచ్చాం మాయిద్దం - చాల మంచి కుర్రాడు. అసూయలేదు - నిష్కల్మషమైన మనసు" అన్నాడు వాసు యిద్దరు స్నేహితులవేపు చూస్తూ.

"మనిషిమాటల్లోనే కన్పిస్తుంది" అన్నాడు రాజు.

"ఇప్పు డెక్కడికి పోతాం - చాలసేపయింది, తిరిగి క్లాసుకిపోతే బావుంటుంది" అన్నాడు వాసు. సరేనన్నారు తక్కిన యిద్దరూ. ముగ్గురూ తిరుగుముఖంపట్టి క్లాసులోకి పోయేసరికి మాష్టరు భయంకర సింహంలా కుర్చీలో కూర్చున్నాడు.

"ఎక్కడికిపోయారోయ్, త్రిమూర్తులు?" అన్నాడు మాష్టరు భీకరంగా. వాసుకాళ్లు వణికినయ్. రాజు, సీతారాం వాసు మొహం చూశారు.

"స్నేహితుడు కలిశాడండీ! అతనితో మాట్లాడుతూ ఆలస్యమయిందండి?" అన్నాడు వాసు వినయంగా.

"మీరిద్ద రేంచేస్తున్నార్రా?" గద్దించాడు మాష్టరు, రాజు, సీతారాంవేపు చూస్తూ. మాగవాళ్లలా యిద్దరూ వూరుకున్నారు. ఎందుకూరుకున్నారో వాసుకి అర్థంకాలా.

"వాడివెంట తిరుగుతున్నారు కదూ! బావుంది - త్రిమూర్తి స్వరూపాలు; మీరిలాపోతే నాకేంగావాలిగాని, వాసు రోజురోజుకి చెడిపోతున్నాడు. చదు వెగ్గొట్టుతున్నాడు కూడా" అన్నాడు మాష్టరు. తనపై మాష్టరుకి దురభిప్రాయం యేర్పడినందుకు స్తంభించిపోయాడు వాసు. ఎదురిచ్చి మాట్లాడలేక పోయాడు. మళ్ళీ మాష్టరే అన్నాడు.

"కృష్ణారావుగారితో చెప్పాలి వాసు విషయం...కూర్చోండోయ్ ...యెందుకలా గుడ్లు మిటకరిస్తూ నిల్చుంటారు" అన్నాడు మాష్టరు. ముగ్గురూ యెవరిజాగాలో వారు కూర్చున్నారు. వాసుకిప్పుడు భయం పట్టుకుంది - కృష్ణారావు గారితో చెప్తానన్నారు. ఒకవేళ చెప్తే యితనికి తనపైవున్న ఆశాస్త్ర అభిమానం పోతుందనుకున్నాడు. అనుకున్నాడేగాని యేం చేస్తాడు? తన రోజులు బాగులేవనుకుని సమాధానపడ్డాడు. లేకపోతే యింట్లోనూ, స్కూల్లోనూ ఒత్తిడి యెందు కధికమౌతుంది?

మధ్యాహ్నం సరిగ్గా అన్నం తినబుద్ధి పుట్టింది కాదు. వదిలేస్తే యేమనుకుంటారోనని బలవంతంగా తిన్నాడు. మధ్యాహ్నం స్కూలు విడిచిపెట్టగానే ధర్మారావుకి చెప్పిన విధంగా గేటుదగ్గర చూశాడు.

---

టీచరు: ఏరా గోపీ! పుస్తకం చదివావురా?

గోపీ: ఆ! చదివానండి.

టీచరు: మరి ప్రశ్నలకు జవాబు చెప్పవేం?

గోపీ: నేను రాత్రి చదివిన సవలలో మీరడిగే ప్రశ్నకు జవాబు లేదండి.

—చింతా రాఘవరెడ్డి, తాళేపల్లిగూడెం.

---

ధర్మారావు కాచుకూర్చున్నాడు. అతన్ని యింటికి తీసుకవెళ్ళాడు. ధర్మారావుకి శాస్త్ర అనుమానంగానే వుంది వాసు మొదటంత ఉత్సాహంగా యెందుకు లేడని. కాని అడిగేపాటి ధైర్యం కలుగలేదెందుకో!


"ఎవా అబ్బాయెవరు?" అంది సీతాలక్ష్మి ధర్మారావునిచూపిస్తూ.

మావూర్లో, "మాయింటి కెదురుగా వున్నారుకదూ! వాళ్ల బ్బాయక్కయ్యా. చిన్నప్పట్నించీ మా యిద్దరికీ స్నేహం" ఉత్సాహంగా అన్నాడు వాసు. ఉత్సాహం కాదూ మరి అత నెప్పుడూ ఊహించలేదు సీతాలక్ష్మి యింటికివచ్చిన వ్యక్తినలా శాంతంగా ప్రశ్నిస్తుందని. అందుకు చాలసంతోషించాడు వాసు

---

శ్రీమదాంధ్ర
మహాభారతము
ఉద్యోగపర్వము
వెల రూ. 1-0-0

విచిత్రవ్యక్తి
వెల రూ. 1-8-0
ఆంధ్రగ్రంథమాల, మద్రాసు-1.



గొడ్డకాడ బుడ్డోడు

ఫొటో: ఎన్. ధర్మారావు, మద్రాసు.

## ★ వాసు చదువు ★

ధర్మారావు చిరునవ్వునవ్వుతూ కూర్చున్నాడు. తరువాత కాస్సేపు వరహాలు, రత్నాలు, ధర్మారావుతో అవీ, యివీ మాట్లాడారు ... కాస్సేపుపోయాక ధర్మారావు బయలుదేరాడు. వాసు అతడివెంట నడిచాడు.

"మనం కూర్చున్నప్పుడు వొచ్చాడే, ఆ అబ్బాయెవరు వాసూ?" అన్నాడు ధర్మారావు.

"మా బావకొడుకు కామేశం", అన్నాడు వాసు.

"గొప్ప గర్వంలా వుందే!" అప్పుడే పసికట్టాడు ధర్మారావు.

"ఏం అలా అంటున్నావ్?"

"ఇంకేవిఁటీ? కనీసం కొత్త వ్యక్తిని చూసినప్పుడెవరని అడగాలా మరి" అన్నాడు ధర్మారావు. వాసు కిప్పు డర్థమయ్యింది.

"అదో తరహా మనిషిలే అతను ...పోనిద్దూ! అవన్నీ మనకెందుకు?" అన్నాడు వాసు సమర్థిస్తూ.

"ఆ సంగతి నాకు తెలుసులే వాసూ! ఒహాకు చెడ్డని యెప్పుడు మాత్రం అన్నావ్ - సరేగాని, మా యింటికి రేపు రావూ?"

"ఇక రోజూ కలుసుకుందాంలే ధర్మా...నాకూ సరైన స్నేహితుల్లేక చస్తున్నా. ఉదయం చూశావే, వా ళ్ళిద్దర్నీ...యెవరనుకుంటున్నావ్? లక్షాధికారుల బిడ్డలంటే నమ్ము. అలాంటివారితో నాలాంటివాడికి స్నేహం యేవిఁటి చెప్పు?"

"మరి విడిచిపెట్టేయలేకపోయావూ?"

"నేను విడిచినా, వాళ్లు వదిత్తేగా!"

దానికి నువ్వేం చేస్తావులే..."

"నే నుంటాను మరి" అన్నాడు వాసు వెనక్కి తగ్గుతూ.

"సరే...మళ్ళీ రేపు కల్సుకుందాం" అంటూ ముందుకి పోయాడు ధర్మారావు.

(ఇంకా వుంది)

పెద్దకథః

# ★ వాసు చదువు ★

ముద్దంశెట్టి హనుమంతరావు

## 11

మూడుసంవత్సరాలు యిట్టే గడిచిపోయాయ్. వాసు ఫిఫ్త్ ఫారమ్‌కివచ్చాడు. గడచిన రోజుల్లో తనను భవించిన కష్టాలు యెప్పటికప్పుడే మర్చిపోతుండేవాడు. గడిచిన ప్రతిక్లాసులో కనీసం రెండు సబ్జక్టుల్లో నయినా ఫస్టుమార్కులు సంపాదించాడు. క్లాసు మాస్టర్ల మాటటుంచితే, క్రిష్ణారావుమాత్రం గర్వించేవాడు. రాజు, సీతారాంలు యెలాగో యీదుకుని బయటపడుతున్నారు. వాసు స్నేహంమాత్రం విడిచిపెట్టలేదు. తమ స్నేహితుడు అందరి మన్ననలు పొందుతుండటం వారికిమాత్రం ఆనందం కాదూ? అసూయాపరులు కాకపోవటంవల్ల తప్పక ఆనందిస్తారు.

ధర్మారావు యిప్పుడు ఫోర్త్ ఫారంకి వచ్చాడు. వాసు తెలివితేటలకి తనూఆనందంతో ఉప్పొంగిపోయాడు. అయిదోక్లాసులో యినస్పెక్టరన్నమాటలు జ్ఞాపకానికి వచ్చినయ్ ధర్మారావుకి. ఇరువురు రోజుకోసారైనా కలుసుకుంటుంటారు. పదిహేనురోజుల కొకసారి యిద్దరూ కలిసి స్వగ్రామం పోతూవస్తుండేవారు.

వాసు ఫిఫ్త్‌ఫారం చదువుతున్నప్పుడే మాష్టర్ల ప్రోద్బలం వల్లనూ, ప్రోత్సాహం వల్లనూ, డ్రాయింగ్, హిందీ, పరీక్షలకి కట్టాడు. పరీక్షలింకా నెలరోజు లున్నయ్. అదే సమయానికి ఆఫ్ యియర్లీ పరీక్షలు కూడా వున్నయ్. ముందు తొందరపడ్డాడేగానీ యిప్పుడేం చేయాలో తోచలేదు. ఒక్క నిమిషకాలం కూడా వ్యర్థంకాకండా, స్నేహితులతో తిరక్కండా యెప్పుడూ యేదో ఒహాటి చదువుతోనో, రాస్తూనో కాలంగడిపేవాడు. కృష్ణారావు మాష్టరు వాసుప్రయత్నానికి సంతోషించి ప్రోత్సహించాడు.

ఉదయం లేచినవెంటనే క్లాసు చదువు, మధ్యాహ్నం యింట్లో వున్నప్పుడు డ్రాయింగు, సాయంకాలంహిందీ మళ్లీ రాత్రి పదివరకు క్లాసు చదువే... యిదీ అతని దినచర్య. డ్రాయింగ్ నేర్చుకుందుకు నాలుగుఫర్లాంగులుదూరంలో వున్న మూర్తిగారింటికిపోయేవాడు. వాసు అభిరుచి గమనించిన మూర్తి శ్రద్ధతో అన్నీ బోధపర్చి నమూనాలు వేసి చూపించేవారు. హిందీలో తెలియని విషయాలు హిందీమాష్టరు దగ్గరికిపోయి తెలుసుకునేవాడు. వాసు యీ యిరువురి వుపాధ్యాయుల సహకారాన్ని యెప్పుడూ తను మర్చిపోనంటాడు

ఇవన్నీ ఓ పక్క వింటూ, ప్రత్యక్షంగా వాసు ప్రయత్నంచూస్తున్న సీతాలక్ష్మికి వాసుపై అసూయ మరింత బలపడింది తన యిరువురు కొడుకుల్లో యే ఒక్కడుకూడా ఆ పరీక్షలకి పోలేదు. ఆ దుగ్ధతో వాళ్లని తిట్టడం విన్నాడు వాసు. ఎన్నంటేమాత్రం యేం లాభం? కళ జన్మతో రావల్సిందే!

అప్పట్నించి వాసు చదువుకి అంతరాయం కల్గించాలన్న నిశ్చయంతో ప్రతిదినం బజారుకి అతన్నే పురమాయించేది. వాసు కాదనగలడా? సహనబుద్ధితో అవన్నీ సక్రమంగా జరుపుకుంటూ వచ్చేవాడు వ్యర్థమైన కాలానికి సరిగ్గా యెక్కువసేపు చదువుతుండేవాడు. ఎవరు యెన్నిప్రయత్నించినా భగవంతుడంటూ వున్నాడు కదూ! విధి యెవడు తప్పించగలడు?

మొదట డ్రాయింగు పరీక్ష, తరువాత హిందీపరీక్ష జరిగినయ్. అవి పూర్తయిన మూడురోజులకే ఆఫ్‌యియర్లీ పరీక్షలు ప్రారంభింపబడ్డాయి. విరామంలేకుండా చదివాడు వాసు. క్లాసుపరీక్షలుకూడా సంతృప్తికరంగానే రాశాడు కాని సరియైన నిద్ర, విశ్రాంతి లేకపోవటంవల్ల వాసు జర్వపీడితుడయ్యాడు. వరహాలు భయపడింది. భయం కదూ మరి—తలిదండ్రులు దగ్గర లేరాయె. కృష్ణారావు మాస్టరు స్వయంగావచ్చి చూసి పోతూండేవాడు. యేం భయంలేదని వరహాలుకి, రత్నాలుకి ధైర్యంచెప్పాడు.

# ★ వాసు చదువు ★

"ఎందుకో, అడ్డమాలిన పరీక్షలకి కట్టి నిద్రాహారాల్లేకండా చదవటం-?" అని సీతాలక్ష్మి మొత్తి పొడిచేది. ఆమె మాట లెవరు విన్పించుకుంటారు?

అదృష్టవశాత్తూ వాసు మూడవ రోజుకే స్వస్థతకివచ్చాడు. జ్వరం పూర్తిగ తగ్గిపోయింది. వరహాలు, రత్నాలు, కృష్ణారావు మాష్టరు సంతోషించారు. కాని సీతాలక్ష్మికి ఆనందమన్పించలేదు. శలవు రోజు లన్నాళ్లూ వాసు పల్లెలో కాలం గడిపేడు. ధర్మారావుకూడా వుండటంవల్ల ఒంటరితనం పొందలేదు. స్కూలు మళ్లీ ప్రారంభించారు. క్లాసుపరీక్ష ఫలితాలు తెలిశాయి. యీసారి వాసుకి ఒక్క తెలుగులోనే ఫస్టు మార్కు వచ్చింది. తక్కిన వాట్లో మంచిమార్కులే వచ్చాయి. మరో పదిహేను రోజులకి హిందీ, డ్రాయింగ్ పరీక్షాఫలితాలు తెలిశాయి. రెండింటిలోనూ వాసుకి ఫస్టుక్లాసే వచ్చింది. వాసు ఆనందంలో తేలిపోయాడంటే నమ్మరూ! తండ్రి వింటే యెంతసంతోషిస్తాడు! అనుకున్నాడు వాసు.

సర్టిఫికేట్లు దొరికిన రోజునే వాసు వాటిని కృష్ణారావు మాష్టరుకి చూపించాడు. వాసు శ్రద్ధకి, శ్రమకి, అచ్చెరువంది అభినందించాడు. నిజంగా తనకి దగ్గిరివాడని చెప్పుకుందుకు గర్వించదగ్గ అబ్బాయని అనుకున్నారాయన మనసులో. అవుతేనేం వాసుకిమాత్రం కృష్ణారావుగారియందు భక్తి పోతూ శ్రద్ధలు లేకపోలేదు. యిప్పటికీ అంటుంటాడు. తన తెలివితేటలకి, శ్రద్ధకి, పునాదివేసింది కృష్ణారావుగారేనని.

ఈ శుభ సమయంలో తండ్రి సూర్యనారాయణ తీవ్ర జ్వరపీడితుడయ్యాడన్న విషాదవార్త వినవచ్చింది వాసుకి. నిజంగా ఆ అబ్బాయి చలించి పోయాడంటే ఆశ్చర్యం లేదు. అప్పటికప్పుడే పల్లెకు వెళ్లాలని నిశ్చయించుకుని కృష్ణారావుగారితో చెప్పాడు. అతనుకూడా విచారించి వెళ్లిరమ్మన్నాడు. వాసు బయలుదేరి పోయాడు పల్లెటూరుకు. అంత జ్వరంలోకూడా కొడుకుని చూసి నవ్వుతూ దగ్గరికి లాక్కొని,

"వచ్చావా నాయనా! నీకోసమే చూస్తున్నా—బుద్ధిగా చదువుకుంటున్నావు కదూ?" అన్నాడు సూర్యనారాయణ. అందరూ ఆశ్చర్యపోయారు; కొడుకు రావటంతో మాట్లాడినందుకు.

"చదువుకొంటున్నా నాన్నా... యీ మధ్య "హిందీ, డ్రాయింగు, పరీక్షలు కూడా పాసయ్యాను." ఎప్పుడీవార్త తండ్రి చెవిన పడేద్దామా అన్న ఆతృతతో వున్నాడేమో మరి-అనేశాడు. పాపం, ఆ చిన్న హృదయానికింకా మంచీ చెడ్డా తెలీదు.

"ఆ! అలాగట్రా..." అన్నాడు సంతోషంలో కళ్లు యింతవిగా చేస్తూ. అప్పటికతనికి ఆయాసం ఆవరించింది. మరి మాట్లాడలేకపోయాడు. వాసు బిక్కచచ్చి "తరువాత అన్నీ చెప్తాలే నాన్నా! మరి మాట్లాడకండి— ఆయాస మెక్కువవుతోంది" అంటూ అక్కడినుండి అవతలికెళ్లాడు.

ప్రతిదినం వైద్యుడువచ్చిమందు యిస్తూనేవున్నాడు. రోజు రోజుకి సూర్యనారాయణ వ్యాధి నయమవుతూ వచ్చింది. అన్నయ్యను చూడాలని వరహాలు, రత్నాలు, పట్నంనుండి వచ్చారు. అప్పటికి సూర్యనారాయణ పరిస్థితి కొంత స్వస్థతకి వచ్చింది. చెల్లెలిని కొడుకు విషయం అడిగాడు. వరహాలు వాసుక ముందాలోచించకండా తనకు కోడలు చెప్పిందంతా చెప్పింది. అవన్నీ తనూ పూర్తిగా నమ్మననికూడా చెప్పింది. కొడుకు అలా ప్రవర్తిస్తాడని సూర్యనారాయణకూడా నమ్మలేకపోయినా విధిలేక కాస్త బాధపడ్డాడు.

"చిన్నకుఱ్ఱాడు కదే...ఏదైనా తప్పుచేయటం సహజం. నువ్వాపాటి సర్దుకోలేవూ" అన్నాడు సూర్యనారాయణ.

"మాటవరసకి చెప్పానే గాని, ఆపాటి సర్దుకోలేకపోతానా అన్నయ్యా" అంది వరహాలు. అన్నదే గాని అది యెంతవరకు నిజం? కోడలు ఎన్నిచాడీలు చెప్పినా, వాసుకి నాలుగుచీవాట్లు పెట్టేదే గాని, కోడల్ని పల్లెత్తు మాటనేది కాదు.

సూర్యనారాయణ మనసుకి తట్టింది. వాసు యింకెన్ని చికాకులు పడుతున్నాడోనని. సహనంతో అనుభవిస్తూ బయటకి వెలిబుచ్చకండా వున్నందుకు కొడుకుని మనసులో మెచ్చుకున్నాడు. సూర్యనారాయణ క్రమంగా లేచు

కున్నాడు. అంచేత వాసు మేనత్తలతో మళ్లీ పట్నం వెళ్లిపోయాడు.

## 12

స్కూల్లో వార్షికోత్సవం జరుగుతుంది. ఆ సందర్భంలో ప్రదర్శించేందుకు బడిపిల్లలచే ఓ నాటకం వేయించాలనుకున్నారు ఉపాధ్యాయులు. అందులో వాసుని తప్పనిసరిగా ఓపాత్ర ధరించమన్నారు. వాసు భయంతో మొదట నిరాకరించాడు. కాని ఉపాధ్యాయులంతా బలవంత పర్చటంవల్ల తలవంచక తప్పిందికాదు. అదే సమయంలో వ్యాసరచన పోటీ ఉపన్యాసముల పోటీకూడా పెట్టారు. వాసు వ్యాసరచన పోటీలో పాల్గొని మొదటిబహుమతి సంపాదించాడు.

నాటకంలో పాత్ర తీసుకున్న సంగతి కృష్ణారావుతో చెప్పాడు వాసు. నాటకాలంటే చెవిగోసుకుండే కృష్ణారావుగారెంతో సంతోషించారు. కాని సీతాలక్ష్మికి నాటకాలాడే వాడంటే పరమ అసహ్యం. వేషాలువేసిన వ్యక్తి ఆమె దృష్టిలోపోరంబోకు. వాసుని కూడ అందులోనే జమకట్టి సంతోషించింది... ఆ అభిప్రాయం ఆమెకి కలగకపోతే అసూయపడేదే!

* * *

నాటకం ప్రారంభింపబడింది. ఎంతోమంది విద్యార్థులూ, ఉపాధ్యాయులు, పౌరులూ వచ్చారు. రాజు, సీతారాం, ధర్మారావు, వీళ్లు ముగ్గురూ ముచ్చటగా స్టేజికి దగ్గర్లోనే నిల్చున్నారు. వాసుపాత్ర చాల చిన్నదయినా బహు నేర్పుతో నటించినందుకు చాలమంది అతన్ని అభినందించారు. వాసు తన శ్రావ్యమైన కంఠంతో పాడిన రెండుపాటలు ప్రేక్షకుల్ని గిలిగింతలు పెట్టేసయ్. మరోసారి పాడమని ఎంతోమంది అరిచారు. కాని ఉపాధ్యాయుడు స్టేజిమీదకొచ్చి, వీళ్లు చిన్నకుర్రాళ్లవటం మూలాన్న మీ కోరిక తీర్చలేక పోయినందుకు చింతిస్తున్నాం అని చెప్పి దిగిపోయాడు. ఏమైనా వాసు చదువులోనే కాక నాటకరంగంలో కూడా అందరి అభిమానం పొందాడు. ముఖ్యంగా కృష్ణారావుగారు గర్వించారు. వాసులో యింత ప్రతిభ యిమిడివుందని తెలుసుకున్నందుకు ఆశ్చర్యపోయాడు.

నాటకరంగంలో వాసు పొందిన ప్రశంస విని మండిపడింది సీతాలక్ష్మి. వాసుని అందరూ పొగుడుతునే వున్నారు. తన కొడుకుల్లో ఒక్కరికీ పొగడ్తయెందుకు రాకూడదన్న అసూయ పేరుకొంది ఆమెలో. వాసునేమీ అనలేక కొడుకుల్ని నోటికొచ్చినట్టు తిట్టింది. యిప్పుడు వాసు మరింత హీనంగా చూడబడుతున్నాడు.

నాటకమైన మరుచటి రోజే వరహాలు కృష్ణారావు దగ్గరికి పోయిందెందుకో. మాటల సందర్భంలో

“మీ మేనల్లుడు స్కూల్లో మంచిస్థానం సంపాదించుకున్నాడు వరహాలూ” అన్నాడు కృష్ణారావు. వరహాలుకి ఆకవిత్వం అర్థం కాలేదు.

“నాకర్థం కాలేదురా” అంది.

“మొన్న నాటకంలో వేషం వేశాడుకదూ! నేనుచూశానులే... యెంత చక్కగా నటించాడనుకున్నావ్... అందరూ వీడి పాట మెచ్చుకున్నవాళ్లే. అంత బాగా పాడతాడని నే నెప్పుడూ అనుకోలేదు” అన్నాడు కృష్ణారావు. వరహాలు వుత్సాహంగా నవ్వింది.

“నువ్వు వినలేదేమో, గాని యింట్లో అప్పుడప్పుడు మెల్లిగా పాడుతుంటాడు. ఎందుకోరా, యెప్పుడూ యేదో ఆలోచించుకుంటూనే వుంటాడు” అంది వరహాలు.

“ఆలోచనెందుకుండదు పిన్నీ — కారణం నాకు తెలుసు... కాని అవన్నీ బయటికి రానీయకండా గడుపుకొస్తున్నాడు. నిజంగా అల్లాంటి అబ్బాయి ఒక్కడుంటే చాలు పిన్నీ. ముద్దేస్తుంది”

“వాళ్ళనాన్న కివన్నీ చూడ్డానికి ప్రాప్తిలేక దూరంగా వున్నాడు. వాడో వూర్లో, వీడో వూర్లోనూ” అంది వరహాలు కాస్త బాధగా.

“అవుతేమాత్రం యేంపోయింది? చూచేవాళ్లు చెప్పుకుంటున్నారుగా! యింకేంగావాలి? అంతే ననుకున్నావా? మొన్న స్కూల్లో పోటీలు పెట్టారులే. అందులో ఒహదానిలో వీడిదే మొదటి బహుమానమట. నిజంగా నాతాలూకు అబ్బాయని, బంధువని చెప్పుకోటానికి గర్విస్తున్నా” అన్నాడు కృష్ణారావు. వరహాలు సంతోషానికి పట్టపగ్గాలు లేకపోయాయ్.

“అందుకేరా— యెవ్వరికీ యిష్టం లేక పోయినా, నేనూ, అక్కయ్య పట్టుపట్టివుంచాం” అంది తన ఆధి

# టామ్‌సాయర్ ప్రపంచయాత్ర

## వారపత్రికలో త్వరలో ప్రారంభమవుతుంది.

టామ్‌సాయర్, హాకల్ బెరీఫిన్, రాజా పేద, విచిత్రవ్యక్తి నవలలతో ఆంధ్రపాఠకలోకానికి మార్క్‌ట్వేన్‌ను పరిచయంచేసిన ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక మరొక మార్క్‌ట్వేన్ నవలను తెలుగులోకి అనువదించి అర్పిస్తున్నది. ఈకథ టామ్‌సాయర్, హాకల్ బెరీఫిన్ నవలలకు తరువాయి కథ. టామ్, హాక్, నీగ్రోజిమ్ ముగ్గురూ ఈసారి ప్రపంచయాత్రకు బయల్దేరుతారు. వేలకొలది మైళ్ళు అవలీలగా ప్రయాణంచేసి, ఎన్నో వింతలు విశేషాలు చూసి, ఎన్నో అద్భుతాలు చేస్తారు. అడుగడుగునా వారు ఎన్నో ప్రమాదాలు ఎదుర్కొంటారు. ప్రతిప్రమాదమూ చివరికి హాస్యంగా మారి నవ్విస్తుంది. ఈ హాస్యం ద్వారా అమెరికన్ గ్రామీణ మనస్తత్వాన్ని చిత్రించి వేళాకోళం చేయడం మార్క్‌ట్వేన్ ఆశయం.

"టామ్‌సాయర్ ప్రపంచయాత్ర" ప్రతివారూ చదివి ఆనందించదగిన సీరియల్.

## ★ మఘుల్ మెహేరీ ★

(41-వ పేజీ తరువాయి)

తున్న భవనానికి తీసుకువెళ్ళింది. ఏం జరిగేదీ చూడడానికి ఆమె భవనం వెలుపలే నిలబడింది.

ఆ భవనంలోనే మఘుల్ మెహేరీ నివసిస్తోంది. ఆ రాత్రే ఆమె ఖుర్దూష్‌కి భార్య అవుతుంది. ఖుర్దూష్ తన బంధువులతోనూ, స్నేహితులతోనూ కలిసి విందారగించి కబుర్లు చెబుతున్నాడు. మఘుల్ మెహేరీ మరొకచోట కొంత దూరంలో కూర్చుని, చెలికత్తెలతో సంభాషిస్తోంది. ఒక చేతిలో విషపాత్ర, మరొక చేతిలో ఒక బాకు పట్టుకుని ఉన్నది. ఖుర్దూష్ నను విధిగా పెండ్లాడదలిస్తే ఆరాత్రే ఆత్మహత్య చేసుకుంటానని ఆమె శపథం చేసింది.

ఇంతలో ఎవరో నూతనయువకుడు భవనంలోకి వచ్చాడని ఆమె విన్నది.

అషిక్ లోనికివచ్చి "సలాం అలేకుం! మీరు విందారగించి ఆనందిస్తున్నారు. నేనొక బీదయాత్రికుణ్ణి. పాటలు పాడి మిమ్మల్ని ఆనందింపజేస్తాను. అనుమతిస్తారా?" అన్నాడు.

ఖుర్దూష్ అలాగేనన్నాడు. అషిక్ కెరిబ్ వాద్యాన్ని చిత్రంగా మీటుతూ మధురంగా పాడాడు:

"ఖలాఫ్ నగరంలో మిస్సిరియన్ ద్రాక్షరసం త్రాగాను. కాని దేవుడు నాకు రెక్కలిచ్చాడు. మూడురోజుల్లో ఇక్కడికి ఎగిరివచ్చాను."

ఖుర్దూష్ తమ్ముడీపాట విని మండిపడ్డాడు. బాకుదూసి "అబద్ధం! ఖలాఫ్ నుండి ఇక్కడికి మూడురోజుల్లో వచ్చావా?" అన్నాడు.

"నామీద ఎందుకు కోపగిస్తావు? నేను నిన్ను సొమ్ము అడగడంలేదు. నమ్మితే నమ్ము కపో. ఇది నిజం," అన్నాడు అషిక్.

"పాడనియ్యి" అని పెళ్ళికొడుకు ఆజ్ఞాపించాడు. అషిక్ పాడసాగాడు.

"ఉదయం నమాజు అర్జినియన్ లోయలో చేశాను. మధ్యాహ్నం నమాజు అర్జిరూమ్‌లో, అస్తమయంముందు నమాజు కార్స్‌లో, సాయంత్రం నమాజు టైఫ్లిస్‌లో చేశాను. అల్లా నాకు రెక్కలిచ్చాడు. నేను ఎగిరివచ్చాను. నేను అబద్ధం ఆడితే, శ్వేతాశ్వం డెక్కలకింద నలిగి చనిపోతాను. ఆ శ్వేతాశ్వం కొండ నుండి కోనకు, కోననుండి కొండకు గాలి కెరటంలాగ తేలిపోతూ ఎగిరింది. దేవుడు అషిక్ కెరిబ్‌కు రెక్కలిచ్చాడు. అషిక్ మఘుల్ మెహేరీ వివాహానికి అందుకున్నాడు."

ఈ పాటవిని మఘుల్ మెహేరీ అషిక్ కంఠం గుర్తించింది. విషపాత్ర ఒకవైపు, బాకు మరొకవైపు విసిరేసింది.

"ఇదేనా నీ శపథం? అయితే ఖుర్దూష్‌ను పెళ్ళాడతావా?" అన్నదొక చెలికత్తె.

---

క్కతే చెప్పుకుంటూ వరహాలు. "మంచి పనిచేశావులే పిన్నీ! ఒకరు బాగుపడితే చూడలేదీ ప్రపంచం" అన్నాడు కృష్ణారావు. కోడలు పిలుస్తుండటంవల్ల యింక మాట్లాడ్డానికి అవకాశంలేక వెళ్ళిపోయింది వరహాలు.

(ఇంకా వుంది)

# ★ వాసు చదువు ★

ముద్దంశెట్టి హనుమంతరావు

(గత సంచిక తరువాయి)

## 13

స్కూల్లో వార్షికోత్సవపు ముగింపుసభ జరిగింది. ప్రార్థన పాడేందుకు వాసునే నియమించారు. అణుకూ, బెణుకూ లేకుండా అంత మందిలో ఒక జాతీయగీతం పాడాడు వాసు. తరువాత వుపన్యాసాలు జరిగినయ్. పిదప బహుమతులు పంచిపెట్టారు.

నాటకంలో వుత్తమంగా నటించినందుకు ఓ వెండిపతకం, వ్యాస రచనలో మొదటి బహుమతిగా పుస్తకం, క్లాసులో కనుపరుస్తున్న తెలివితేటలకి, మరో పుస్తకం వాసుకి లభించాయి. తెలుగులో మంచి కృషి చేసినందుకు పద్య కావ్య మొకటి చిన్నది తెలుగు పండితులు బహూకరించారు వాసుకి. అందరి సముఖంలో అన్ని బహుమతులు పొందినందుకు అమితానందం పొందాడు వాసు. అవన్నీ ప్రక్కనే వున్న రాజు, సీతారాం, ధర్మారావులు చెరొకటీ పట్టుకున్నారు. తమ స్నేహితుడి ప్రతిభకు అనుగ్గుణా యెంతో ఆనందించారు. వాళ్లకి వాసు బహుమతులు పొందాడన్న అసూయ లేదు. తాము పొందలేదన్న కాంక్ష, విచారాలు లేవు వారికి.

నలుగురూ నడుస్తున్నారు. విద్యుద్దీపాల కాంతిలో వాళ్లముఖాలు ప్రకాశవంతంగా అగుపిస్తున్నయ్.

"మన సెక్షను పేరుంచావోయ్" అన్నాడు రాజు.

"మాష్టరు నిన్నెంతగా మెచ్చుకుంటాడనుకొన్నావ్" అన్నాడు సీతారాం. ధర్మారావు బయటికేం అనకండా తనలో తనే స్నేహితుని గురించి గర్వపడుతూ ఆనందిస్తున్నాడు.

ఇంత జరుగుతున్నా కామేశం గాని, విశ్వంగాని, వాసుదగ్గరికి రావటమే లేదు. కామేశం రాడన్న సంగతి తెలుసు వాసుకి. కాని విశ్వం యెందుకు తనతో కలియలేదో అర్థం కాలేదు వాసుకి. పుస్తకాలు చేత్తో పట్టుకుని యిల్లు చేరుకున్నాడు వాసు. మొదట వాటిని మేనత్తలకీ, సీతాలక్ష్మికి చూపించాడు. మేనత్తలు ఆనందించారు. సీతాలక్ష్మి విషపునవ్వు నవ్వేసి వూరుకుంది. అప్పుడే కామేశం వచ్చాడు. చూపించకపోతే బావుంటుందా? అతనికూడా పుస్తకాలు వెండిపతకం చూపించాడు.

"నాకు తెలుసు లేవోయ్— నేనూ అక్కడే వున్నానుగా; చూపించటం యెందుకూ?" అన్నాడు ద్వేషభావంతో. వాసు చిన్నబోయాడు.

"ఏడిశావులే వెధవా! సిగ్గు లేకపోతే సరి...అతడికాళ్లు కడిగినా నీకు బుద్ధి రాదు" ఆ కోపంలో వాసుకి ఆధిక్యత యివ్వకండా వుండ లేకపోయింది.

"బావుందమ్మా, నువ్వన్న మాట—అందరూ ఒక్కలాగే వుంటారనుకున్నావా?" అన్నాడు కాస్త కోపం కనబరుస్తూ కామేశం.

"నీ మొహానికి యెదురుజవాబులు కూడాను" అంది సీతాలక్ష్మి కోపంగా.

"చాల్లే అమ్మా! నీతో యెప్పుడూ యీ తగాదా వున్నదేగా" అంటూ లోపలికి పోయాడు కామేశం.

మరుచటిరోజు వుదయం తనకందిన బహుమతులు తీసుకుపోయి కృష్ణారావు మాష్టరుకి చూపించాడు వాసు. అతని సంతోషం యెలా తెలియబర్చాలో అర్థం కాలేదు.

"వాసూ, నిన్నెలా పొగడాలో అర్థం కాలేదు. నువ్వెప్పుడూ యీ శ్రద్ధతోనే చదువు; బహుమతులు పొందుతూండు. ఇన్నాళ్లకి నాకానందం కలిగించే విద్యార్థి బంధువుని చూడగలిగాను. మాకుటుంబంలో ఒక్కరూ లేరులే. అంతా షోకులు చలాయించేవారేగాని, చదువులున్నా; ముందు ముందు యిలాగే అందరి అభిమానం సంపాదిస్తావని నమ్ముతాను" అన్నాడు నవ్వుతూ వుపదేశిస్తున్నట్టుగా. వాసు యేం జవాబు చెప్తాడు? ఆనందపార

వశ్యంతో ఒక్కసారి పెదాలపై నవ్వును దొర్లించాడు.

## 14

సూర్యనారాయణ దినదినానికీ వృద్ధుడై పోతున్నాడు. ఏ పనిలోనూ భాగం పుచ్చుకోలేకపోతున్నాడు. కాలం గడుస్తున్నది, వాసు స్కూలుఫైనల్‌కి వచ్చాడు. కామేశం ఓసారి స్కూలుఫైనల్ తప్పిపోవటంవల్ల మళ్లీ అదే క్లాసు చదువుతున్నాడు. వాసు తనతో కలిసిపోవటం కామేశంకి ద్వేష భావం పుట్టింది. కాని యేం చేస్తాడు ? అదెవరి తప్పు ?

వాసు స్కూలుఫైనల్ చదువుతున్నప్పుడెన్నో ఆటంకాలు కలిగినయ్. సీతాలక్ష్మి వాసు చదువుకి అంతరాయం కల్గించాలని యెప్పుడూ యేదో ఒకపని పురమాయిస్తుండేది. చిన్నపిల్లలకి చదువు చెప్పమనేది. ఇవన్నీ వాసుకి కొంతవరకు కష్టమనిపించినా సహనంతో భరించాడు. తండ్రి వృద్ధాప్యంవల్ల వున్న కాస్త వ్యవసాయమైనా సరిగ్గా జరిగేది కాదు. అదో ఆలోచన వాసుని బాధ పెడుతూండేది. ఓ ప్రక్క కామేశం యెప్పుడూ కలహాలకే చూస్తుండేవాడు. కాని వాసు మూగవానిలా వూరుకుండేవాడు. ఇంక మూరెన్నాళ్లు ? ఓ సంవత్సరం పాటు భరించా లనుకున్నాడు.

ఎన్నో, పుస్తకాలు, నోట్సులు, కావల్సివచ్చేవి. అవన్నీ కొనుక్కుందుకు వాసు సాగలేక పోయేవాడు డబ్బులేక. సూర్యనారాయణ కొడుక్కి ఆర్థికంగా సహాయం చేయలేకపోతున్నందుకు విచారించేవాడు. కామేశం కొన్న నోట్సులు వుపయోగించేందుకు వాసుకి అభిమానం అడ్డువచ్చింది. అంచేత రాజు, సీతారాంలదగ్గర అప్పుడప్పుడు నోట్సులు తెచ్చుకుని రాసుకుంటుండేవాడు.

పరీక్షలు దగ్గరపడుతున్నయ్. ఇంతకుముందుకంటె శ్రద్ధగా చదువుతున్నాడు వాసు. కొన్ని వాసుకి తెలీని విషయాలు కృష్ణారావుగారికి కూడా అందుబాటులో వుండేవి కావు. అవి క్లాసుమాష్టర్నడిగి తెలుసుకునేవాడు వాసు.

పరీక్షలు జరిగిపోయాయ్. తృప్తిగానే రాశానన్నాడు వాసు కృష్ణారావుగారితో. సరియైన నిద్రలేకపోవటం వల్ల వాసు ఆరోగ్యం చెడి నీరసించిపోయాడు. వెనుకముందు చూడకండా స్వగ్రామం పోయాడు. కొద్దిరోజులు ఏటి గాలి తగలటంతో మళ్లీ తేరుకున్నాడు.

పరీక్షా ఫలితాలు తెలిసినరోజు





"ఇక్కడున్నావా, దొంగా!" ఫొటో : ఈమని సత్యనారాయణరెడ్డి, రాజమండ్రి.

## వాసు చదువు

ధర్మారావుతో కలిసి పట్నం వచ్చాడు వాసు. వాసు పాసయ్యాడు. రాజు, సీతారాం, కామేశం పాసయ్యారు. తమ కొడుకు పాసయినందుకు సూర్యనారాయణదంపతులెంతో ఆనందించారు. రత్నాలు, వరహాలు, వుప్పొంగిపోయారు. కృష్ణారావు గారు మొదటే వూహించుకున్నారు పాసవుతాడని. పోతే సీతాలక్ష్మి వాసు పాసయినందుకు విచారించింది.

స్కూలుఫైనల్ కి మించి అక్కడ చదువులేనందువల్ల, తండ్రి వృద్ధాప్యంలో వున్నందువల్లపై చదువులకి పోలేక చదువుకి స్వస్తిచెప్పాడు వాసు. చాలమందిమాష్టర్లు వాసుని పై చదువుకి పంపిస్తే బావుంటుందని కృష్ణారావు మాష్టరుతో చెప్పారు. కాని అతనుమాత్రం యేమిచేస్తాడు? వాసుకి ఆర్థిక స్తోమత లేదని తెలుసు—

వాసు పట్నంలో పూర్తిగా మకాం యెత్తేసి పల్లెచేరుకున్నాడు. కాని యింతా చదువుకున్న తరువాత పల్లెలో వుండిపోతాడా? సూర్యనారాయణ ఆశయం కొడుకు వుద్యోగం చెయ్యాలని కదూ!

వాసు కిప్పుడు వుద్యోగాన్వేషణ పెద్దసమస్యయింది. ఎన్నో దరఖాస్తులుపెట్టాడు. జవాబుల్లేవు. పట్నములో కనిపించిన ఆఫీసు గడప లెక్కాడు. ప్రతిచోట ఖాళీలులేవన్నమాటే! ఎంతని తిరుగుతాడు? విసిగి వూరుకున్నాడు. సూర్యనారాయణ ఆశయం సిద్ధించలేదు. మళ్లీ మనసు మార్చుకున్నాడు— కొడుకు తనకెందుకు దూరంగా వుండాలి? అని. సంవత్సరంవరకు అలానే వాసు నిరుద్యోగిగా కాలం గడిపాడు. ఈ సంవత్సరంలో ధర్మారావు

# విధిలిఖితం

వెం. యం. చౌ.

'వీ'కు ఒకసలక్షణమైన పిల్లను భార్యగా చేసుకోవాలని కోరిక కలిగింది. కాని ఇంతవరకు అతని కోరిక నెరవేరలేదు. కారణం- అతనికి నచ్చిన పిల్ల దొరకలా. ఒకప్పుడతడు 'సింగ్‌హా'కు ప్రయాణమయి వెళుతూ, సంగ్‌చంగ్ పురదక్షిణద్వారానికి అవతలున్న సత్రంలో ఆగాడు. సాంఘికంగా అతనితో సమానమయినటువంటి పాన్‌కుటుంబంలో ఒక మ్మాయి ఉందనీ, ఆ సంబంధాన్ని గూర్చి మాట్లాడటానికి తన్ను లంగ్‌షింగ్ దేవాలయంలో ఉదయంపూట కలుసుకోవలసిందని 'వీ'తో ఓ పెళ్ళిళ్ళ పేరయ్య చెప్పాడు. భాగ్యవంతురాలు, అందమైన యువతి తనకు భార్య కాబోతోందనే సంతోషంలో అతనికి ఆ రాత్రి నిద్రపట్టక వేకువనే లేచాడు. లేచి స్నానాదికాలు పూర్తి చేసుకుని చక్కగా అలంకరించుకుని నిర్ణీత సమయానికి బయలుదేరాడు. ఇంకా సరిగా తెల్లవారలేదు. నీలాకాశంలో చంద్రుడు ప్రకాశిస్తూనే వున్నాడు. 'వీ' అక్కడికి చేరేటప్పటికి, చంద్రకాంతిలో ఏదో పుస్తకం చదువుతూ దేవాలయం మెట్లపై కూర్చున్న ఒక వృద్ధుని చూచాడు. అతని ప్రక్కనే నేల మీద ఓ చిన్న సంచి వుంది.

ఈ సమయం కాని సమయంలో ఆ వృద్ధుడు ఏం చదువుతున్నాడో తెలుసుకోవాలని కోరిక కల్గింది 'వీ'కు. ఆ వృద్ధుడి భుజాలమీద నుంచి తొంగిచూచాడు. కాని అదేమిటో అతనికి అర్థమవలేదు. పురాతనమైనటువంటి, ప్రాచీనమైనటువంటివి అన్ని భాషలూ— ఆఖరుకు సంస్కృతం కూడా అభ్యసించాడు 'వీ'. మరి ఈ వ్రాత ఏమిటో అతనికేమాత్రం బోధపడలేదు.

"నువ్వు చదివేపుస్తకం ఏమిటో అడగవచ్చునా తాతా? నాకు ఈ ప్రపంచంలో వున్న భాషలు, లిపులన్నీ తెలుసుననుకుంటున్నాను. మరినువ్వు చదివే లిపిలాంటిది నేనెప్పుడూ చూడలేదు."

"అవును, నువు చూచివుండవు. నీకు తెలిసే ఏభాషలోను ఇది వ్రాయబడలేదు." అని చిరునవ్వు నవ్వుతో ఆ వృద్ధుడు సమాధానమిచ్చాడు.

"అయితే మరేమిటి?"

"నువ్వు మానవమాత్రుడివి. నీకేం తెలుసు నాయనా? ఇది దేవలోకపు గ్రంథం."

"అయితే నువ్వు దేవతవన్నమాట! ఏం చేస్తున్నావిక్కడ?"

"ఏం, ఎందుకుండకూడదిక్కడ నేను? నువ్వు చాలా పెందరాళే వచ్చావు. రాత్రికి ప్రాతఃకాలానికి

---

స్కూలుఫైనల్ చదువుతూ ప్యాసయ్యాడు. అతడికీ అదే సమస్య.

అయితేనేం ధర్మారావుకి ఆర్థిక స్తోమత వుంది. పై చదువు చదవాలని వున్నా వాసుని విడిచి పోలేకపోయాడు. ఏమిటో ఆ అనుబంధం వాళ్ళిద్దరికీ! వుద్యోగాన్వేషణలో కాలాన్ని వ్యర్థంచేయటం ధర్మారావు కిష్టంలేకపోయింది. తండ్రి సలహాపై ఓ ఫేన్సీస్టోర్సు ఆ పల్లెలో పెట్టాడు తన స్వంతమదుపుతో. అందులో వాసుని తనకి అదనుగా తీసుకుని నెలకి యాభైరూపాయలిస్తుండేవాడు. పట్నంనుండి కొత్త వస్తువులు తెచ్చి అమ్ముతుండేవాళ్లు. రాను రాను ఆ కొట్టు పెద్దస్టోరుగా మారింది. ఇప్పుడు వాసుకూడా అందులో కొంతభాగస్థుడే... అటు తండ్రి వ్యవసాయం, యిటు వ్యాపారం చూసుకుంటూ కాలం గడుపుతున్నాడు.

అప్పుడప్పుడా యిరువురు స్నేహితులు ఆలోచిస్తుంటారు తాము చదివి సాధించిందేమిటీ అని. దానికి జవాబు యేం రాదు...ఒక్కటే పరోక్షంగా అగుపిస్తున్న జవాబు- ప్రపంచజ్ఞానం సంపాదించారని. అంతే!

(అయిపోయింది)